# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్: (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267
web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
గూడూరి వెంకటరత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ ఎన్.రామతారక వరబ్రహ్మశాస్త్రి
మిన్.వి. ఇందిరాదేవి
డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు
డా॥ యమ్.స్వర్ణముఖి

Volume 31 Issue 5
No.of Pages 40
JANUARY 2012

| | |
|---|---|
| 5సం॥ల చందా | రు. 250.00 |
| 2సం॥ల చందా | రు. 120.00 |
| సంవత్సర చందా | రు. 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. 5.00 |

బ్యాంక్ డ్రాఫ్టు A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:
మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో....** **పేజీ**

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 6 |
| దైవలీల | 8 |
| సన్నిధిలో సంభాషణ | 10 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 12 |
| భక్తి విజయం | 13 |
| గురు కృపాహి కేవలమ్ | 15 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 17 |
| పరిప్రశ్నేన సేవయా | 19 |
| వివాహ మహోత్సవాహ్వాన శుభ పత్రిక | 20 |
| శివానందలహరి | 21 |
| కార్యదురంధరుడు | 23 |
| శ్రీబాబూజీతో అనుభవాలు | 24 |
| నాడు-నేడు | 25 |
| ఆహ్వానము | 27 |
| సమర్థ సద్గురు నాధుని దివ్యచరిత్ర | 29 |
| అమావాస్యనాడు పూర్ణిమ | 31 |
| బెంగుళూరులో శ్రీమాతాజీ సత్సంగం | 33 |
| శ్రద్ధ | 37 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

*విక్షేప శక్తీ రజః క్రియాత్మికా। యతః ప్రవృత్తిః ప్రసృతాపురాణీ*
*రాగా దయో Zస్యాః ప్రభవన్తి నిత్యం।దుఃఖాదమోయే మనసో వికారాః*

(వివేకచూడామణి శ్లో॥113)

మనస్సు అంటేనే మాయాశక్తి. ఆవరణ విక్షేప దోషాల ప్రభావం చేతనే మానవుడు సంసార బంధనకి గురి అవుతున్నాడు. విక్షేపశక్తి రజోగుణానికి సంబంధితమైనది. కామం, క్రోధం, లోభం, ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనం, అసహనం, అహంకారం మొదలైనవి అన్నీ రజోగుణ ధర్మాలు. వీటి ప్రభావం చేతనే మనోవికారాలైన రాగద్వేషాలు, సుఖదుఃఖాలు కలుగుతున్నాయి. సంసార బంధనానికి కారణాలు యివే.

ఆవరణశక్తి తమోగుణ సంబంధితమైనది. నిద్ర, పరాకు, మూఢత్వం, సోమరితనం, జడత్వం మొదలైనవన్నీ తమోగుణ' ప్రధానమైన ధర్మాలు. వీటి ప్రభావం చేతనే జనన మరణ వలయంలో చిక్కుకుంటున్నాడు. ఆవరణ శక్తి సంసారానికి కారణభూతమైతే, విక్షేపశక్తి ఆ సంసారంలో కూరుకుపోయేటట్లుగా చేస్తుంది. ఆవరణ శక్తి ప్రభావం చేతనే మానవుడు అభావనా, విపరీత భావనా, సంభావన విప్రతిపత్తి అనే మూడు లక్షణాలలో ఏదో ఒక లక్షణాన్ని అనుసరిస్తున్నాడు.

సత్యమైన ఆత్మవస్తువు లేదనుకోవటమే అభావన. దేహమే తాను అనుకోవటమే విపరీత భావన. గురూపదేశాన్ని శ్రవణం చేసినా దాన్ని విశ్వసించక సందేహించటమే సంభావన విప్రతిపత్తి అని పిలువబడుతుంది.

అంతేకాదు ఆవరణశక్తి ప్రధానంగా వస్తువు యొక్క యదార్థ రూపమును మరుగుపరచి, దానిని వేరొక రూపముగా దోచునట్లు చేస్తుంది. ఎంత పండితుడైనా, ఎంత సూక్ష్మదృష్టి కలవాడైనా, ఎంతటి మేధావియైనా ఆవరణ శక్తి ప్రభావముచేత దేహాది ప్రపంచమే సత్యమని, నిత్యమని నమ్మి, ఆత్మ జ్ఞానాన్ని పొందజాలడు. దురంతమైన ఆవరణశక్తిని సద్గురుమూర్తి కృప లేనిదే జయించటం బహుదుర్లభం. సద్గురు మూర్తిని ఆశ్రయించి ఆయన ప్రసాదించిన లక్ష్యార్థ సాధన చేయటమే సరియైన మార్గము.

**పరాశర ప్రసాద్**
**గౌరవ సంపాదకులు**

# అమ్మ ఆశీస్సులు

***నాధేనః పురుషోత్తమే త్రిజగతామేకాధిపే చేతసా***
***సేవ్యే స్వస్య పదస్య దాతరి సూరే నారాయణే తిష్ఠతి***
***యం కఞ్చిత్పురుషాధమం కతిపయగ్రామేశ మల్పార్థదం***
***సేవాయై మృగయామహే నరమహో మూఢా వరాకావయమ్ ॥***

ముల్లోకములకు అధిపతియైన పురుషోత్తముని మనస్సులో ధ్యానించినంతనే స్వస్థానాన్నే మనకు యిస్తుంటే సర్వాంతర్యామియైన శ్రీమన్నారాయణుని భజింపక మందబుద్ధులు అవివేకులై, అల్పుడైన సామాన్యుని వెతుక్కుంటూ వెళ్ళి అతని మెప్పును సంపాదించి, అతడిచ్చే అల్పధనానికి ఆశపడి తమ జీవితములను వ్యర్థం చేసుకుంటారు.

ఇలా మనందరికి తమ సందేశమును ముకుందమాల ద్వారా కులశేఖర మహారాజు వారు అందించారు. ఈ ప్రపంచమునందు అల్పమానవుడు తన అవసరానికి చిన్నచిన్నవి సంపాదించడానికి 'కఞ్చిత్పురుషాధమం కతిపయ గ్రామేశమల్పార్థదం' వారివారి సేవలు చేస్తూ ఆశ్రయిస్తున్నాడు. తన స్థానమునే మనకివ్వడానికి సిద్ధంగా ఉన్న శ్రీమన్నారాయణుని ఒక్కడిని శరణుపొందితే చాలు. శ్రీగురుదేవులు వారి బోధామృతము నందు చెబుతూ ఉండేవారు. ఏ భక్తుడైతే శ్రీమన్నారాయణుని ఆశ్రయిస్తారో ఆయన భార్య శ్రీమహాలక్ష్మి ఇహమునకు, స్వామి పరమునకు ఏ లోటు రానివ్వడు కదా! శరణు పొందితే చాలు. అర్జునుడు కూడ శ్రీకృష్ణ భగవానుని భగవద్గీత యందు రెండవ అధ్యాయంలో ***'కార్పణ్యదోషో పహత స్వభావః। పృచ్ఛామిత్వాం ధర్మ సమ్మూఢ చేతా। యచ్ఛ్రే యస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే । శిష్యస్తే zహం శాధి మాం త్వాం ప్రపన్నమ్*** ॥' అన్నాడు అర్జునుడు.

అప్పుడు స్వామివారే ముఖస్తగా అమృత ప్రవాహమును అనుగ్రహించారు. ఈ జీవుడు నేను నాది అని మాయలో ఉండి స్వతంత్రించి, యీ జగత్తును ఆశ్రయిస్తే వచ్చేది బూడిదే!. జగన్నాధుని ఆశ్రయిస్తే ఆశ్రయించిన వారి జీవితము ఫలిస్తుంది. జీవిత గమ్యమును సాధించ గలరు. అట్టి సమర్థ సద్గురువు గీతాచార్యుడు అలాగే సమర్థ శిష్యుడు అర్జునుడు. అలాగే మనము కూడా మనకు దొరికిన సమర్థ సద్గురుని పాదములను ఆశ్రయించి, శ్రీవారి ముఖస్తుగా ప్రవహించిన పదములను అనుసరించి ఆచరించిన యెడల పరబ్రహ్మ పదాన్నే ప్రసాదిస్తారు. అట్టి సద్గురుదేవుల దివ్య కృపను మనకందరికీ వర్షించెదరు గాక! అని శ్రీపదములను ప్రార్థిస్తూ.........

మీ అమ్మ

# బాబూజీ ఉవాచ

- వెంకట రమణ ప్రసాద్

## 3. ఉపవాసము - బ్రహ్మచర్యము

సాధారణంగా 'ఉపవాసము' అనే మాటకు 'భోజనం చెయ్యకుండా ఉండటం' అనే అర్థం చెప్పుకుంటాముగాని, ఆ పదం యొక్క సరియైన, సంపూర్ణమైన అర్థాన్ని విశ్లేషిస్తేగాని తెలుసుకోలేము. 'ఉప' అంటే 'సమీపంలో', 'వాసము' అంటే 'నివసించటము' కనుక 'ఉపవాసము' అంటే భగవంతునికి వీలైనంత దగ్గరగా వెళ్ళి ఉండటం అనేది నిజమైన అర్థం. అంటే మనస్సు ఎంత ఎక్కువగా, సంపూర్ణంగా భగవానుని యందు లగ్నమైతే అంత బాగా ఉపవసించినట్లు, అంతేగాని 'ఉపవాస' శబ్దాన్ని తినటం, త్రాగటం వరకే పరిమితం చెయ్యటం ఆ పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవటమే. భగవంతుని యందు మనస్సు నిలిపితే ఉపవాసమే. నువ్వు ఏం తిన్నావు, ఎం తిన్నావు అనేది ప్రధాన విషయం కాదు.



కొంతమంది ఉపవాసకాలంలో ఆహారపానీయాలను సంపూర్ణంగా వర్జిస్తారు. కొంతమంది నీరు కూడా ముట్టరు. మరికొంతమంది నోటిలో ఊరే లాలాజలం కూడా లోపలికి పోకుండా జాగ్రత్తపడతారు. అటువంటి కఠోర నియమాలు మెచ్చదగినవేగాని, వాళ్ళ మనస్సులు మహావేగంగా విషయాల వెంట పరిభ్రమించటం విచారించ వలసినదే. శారీరకంగా వాళ్ళు ఏ ఆహారపదార్థాన్నీ దగ్గరకు రానీయకపోయినా, వాళ్ళ మనస్సులు మాత్రం యీ ఉపవాసం పూర్తికాగానే వాళ్ళు తినబోయే పదార్థాల రుచుల మీదకు ప్రవర్తిస్తూనే ఉంటుంది. ఎప్పుడెప్పుడు కడుపు నిండుగా తిందామా అని అవురావురు మంటూ ఉంటారు కొందరు. భగవంతుడి యందు లీనం కావలసిన మనస్సు యిడ్లీల మీదకూ, ఉప్మాలమీదకూ ప్రసరించటం వలన ప్రయోజనం ఏమిటి?

ఇంకా కొంతమంది ముందు చూపుగల వాళ్ళు రేపు ఉపవాసమనగా యీ రోజు రాత్రి నుంచే చాల ప్రత్యేకమైన యేర్పాట్లు చేసుకుంటారు. ఉపవాసం అనే కష్ట సాగరాన్ని దాటటానికి కావలసిన బలం కోసం యీరోజే రేపటికి కూడా సరిపోయినంత పట్టిస్తారు. రెండు మూడు లీటర్ల పాలూ, ఒక పాతిక అరటిపళ్ళూ, ఒక డజను బత్తాయిలూ, ఒక అరడజను యాపిలుపళ్ళూ

మాత్రం లఘువుగా ఏర్పాటు చేసుకుంటారు. ఇవికాక, ఉపవాసం అంటే అల్పాహారం తీసుకోవచ్చు. గనుక, ఇడ్లీలూ, ఉప్మాలూ అందుబాటులో ఉంచుకుంటారు. ఇవన్నీ ఆరగించి ఉంటే ఉపవాస ఫలితం ఏమిటి? కడుపు బరువు, ఆయాసం, నిద్ర, అజీర్ణమూ యిలా తమోగుణంతో తలక్రిందులు అయ్యేవాడికి భగవంతుడు బహుదూరంలో ఉంటాడు. అసలు తిండికోసం వెంపర్లాడేవాడికి దేవుడెక్కడ గుర్తొస్తాడు?

ఉపవాసం పేరిట చుక్క మంచినీళ్ళు కూడా ముట్టక పోవటమూ, లేదా అతిగా తిని అజీర్ణం తెచ్చుకోవటమూ అనే యీ రెండు కూడ ఉపవాసాన్ని పాటించే సరైన పద్ధతులు కావు. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్న పెద్దల మాట చద్దిమూట.

***వివిక్త సేవీ, లఘ్వాసీ యతవాక్కాయ మానసః ।***
***నానస్తశ్నతస్తు యోగోస్తి నచ యోగోస్త్యనశ్నతః***
***నచాతి స్వప్న శీలస్య జాగ్రతో నైవనచార్జున ॥***

అని బోధించాడు గీతాచార్యుడు. అందువల్ల ఉపవాస సత్ఫలం పొందాలనుకునే వాడు మితాహారిగా ఉండాలి. మితాహారము, మిత నిద్ర ఉన్నపుడే యింద్రియాలు చెప్పిన మాట వింటాయి.

సాధన సరిగా జరగటానికీ, మనస్సు నిలపటానికీ మితాహారం ఎంతైనా అవసరం. అలా భగవానుడి యందు తన బుద్ధిని స్థిరంగా నిలుపనేర్చిన వ్యక్తికి ఆహార విహారముల యందు విధి నిషేధాలతో పని ఉండదు. అతడు రెండు పూటలా భోజనం చేస్తూనే ఉన్నా, అతడి మనస్సు భగవానుని యందు నిలపటం వల్ల అతడు సదోపవాసియే అవుతాడు. అతణ్ణి నిత్యోపవాసి అంటారు. ఈ అంశాన్ని చక్కగా వివరించే కథ ఒకటి ఉన్నది.

ఒకనాడు దుర్వాస మహర్షి శిష్యసమేతుడై శ్రీకృష్ణ దర్శనార్థం విచ్చేశాడు. రుక్మిణీ సత్యభామాది అష్టభార్యాసమేతుడై, శ్రీకృష్ణస్వామి మహర్షికి ఎదురేగి, అర్ఘ్యపాద్యాదులిచ్చి, ఉచితాసనంపై ఆశీనుణ్ణి చేసి, భార్యాసహితంగా, ఆ మహర్షికి పాదసేవ చేసుకున్నాడు. ఆ ఆతిధ్యానికి పరమ సంతుష్టుడైనాడు దుర్వాసమహర్షి. "శ్రీకృష్ణ ప్రభూ! నా మనస్సు సదా నీ యందు నిలిచినా, నీ దివ్య సన్నిధానంలో కొంతకాలం ఉండాలనే కోరికతో యిలా బయల్దేరి వచ్చాను" అన్నాడు దూర్వాసుడు.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద



*"మాయ జాలమున మునిగేవు నరుడా*
*దారి తెలియక తడబాటు ఏలా?*
*జ్ఞాననేత్రమున వెదకి చూడుమా*
*శాశ్వత జ్యోతి కనుగొనుమా ॥మా॥*
*1) నీ జీవిత నిర్మాతవు నీవే*
*నీ కృషియే ఇల ఫలియించురా*
*మదిలో కల్లోలము విడరా*
*మనసున కల దేవుని కనరా ॥మా॥*
*2) జీవిత సమర విహారములోన*
*దీక్షా ధైర్యము జయభేరిరా*
*జీవుడిలో శివుడున్నాడురా*
*ఆ శివుడే జగదాధారి రా ॥మా॥*

ఇది అచ్చ తెలుగులోనే వున్నది కనుక వేరే వివరింపవలసినది ఏదీ లేదు. బయట నుండి ఎన్ని మాటలు విన్నా, మారవలసింది నువ్వు. మామూలు జీవితంలోనే ఏ పనికైనా కృషి చేసి తీరవలసిందే. నిష్ఠ చేస్తేనే జీవన్ముక్తులవుతున్నారు. నిష్ఠ అనేది పశు పక్ష్యాదులకి కూడా వుంది. కానీ మానవుడే నిష్ఠ నిలుపుకోలేకపోతున్నాడు.

తాబేలు ఎంత మెల్లగా వెళ్ళినా దాని గమ్యాన్ని చేరుకుంది అని, మనం చిన్నప్పుడు తాబేలు-కుందేలు కథలో చదువుకున్నాం. కూర్మదాసు అనే గొప్ప పండరినాధుని భక్తుడు ఉండేవాడు. నిజంగా కూర్మావతారమేనన్నట్టు, ఆయనకి రెండుకాళ్ళూ లేవు. అనూరుడి అంశతో జన్మించాడని చెప్తారు. కానీ, ఎలాగైనా ఆషాఢ శుద్ధ ఏకాదశి నాటికి పండరిపురం వెళ్ళి పండరినాధుడిని సేవించుకోవాలని ఆయన కోరిక. ఎవరిని అడిగినా సహాయం చేయడానికి ఒక్కరుకూడా ముందుకు రాలేదు. 'నా ప్రయత్నం నేను చేస్తాను. ఆపైన పండరినాధుని దయ' అని కూర్మదాసు దేకుకుంటూ పండరియాత్ర మొదలు పెడతాడు. రోజుకి రెండు క్రోసుల దూరం దేక్కుంటూ వెళ్తున్న కూర్మదాసుని

చూసి, తోటి యాత్రికులు సహాయం చేయకపోవడం పోయి, "రెండు కాళ్ళూ సరిగా వున్న మేమే నడవలేకపోతూంటే, నువ్వేం వెళ్తావు పండరికి? అసలే కూర్మావతారానివి! వచ్చింది చాల్లే. తిరిగిపో" అని ఎగతాళి చేసేవారే అందరూ! కానీ కూర్మదాసు భక్తి నిశ్చలమయినది. ఎవరెన్ని వేళాకోళాలాడినా, తన పట్టు వదలలేదు. డేక గలిగినంత దూరం డేకి, "ప్రభూ! నన్ను రక్షించవా?" అని చతికిల పడిపోయేవాడు. సర్వాంతర్యామి అయిన పండరినాధుడికి తెలియనిదేముంది? ఆయన ఒక వర్తకుడి రూపంలో వచ్చి, "కూర్మదాసూ! నేనొక వర్తకుడిని. ప్రతిరోజూ నువ్వు ఎక్కడ ఆగితే అక్కడికి వచ్చి, నీకు భోజనాదులు సమకూరుస్తానయ్యా" అని, చక్కటి షడ్రసోపేతమైన భోజనం ప్రతిపూటా అందచేస్తున్నాడు నటన సూత్రధారి!

ఇలా నెమ్మదినెమ్మదిగా ప్రయాణం సాగిస్తున్నాడు కూర్మదాసు. నాలుగు నెలలు జరిగింది. ఇక మరుసటి రోజే ఆషాఢ శుద్ధ ఏకాదశి. అప్పటికి బహుళాపురం అనే ఊరి వరకూ వచ్చాడు. తాను వెళ్తున్న వేగం ప్రకారం పండరి చేరుకోవాలంటే ఏడు రోజులు పడుతుంది కూర్మదాసుకి. "ఏకాదశి నాటికి నీ పాదల చెంతకి చేరుదామని అనుకున్నానయ్యా! కానీ అశక్తుడిని. నీ దయ నా మీద వర్షింపచేసి నాకు దర్శనమీయవా ప్రభూ అని నా మాటగా పండరి నాధుడికి చెప్పండి" అని తోటి యాత్రికులతో చెప్పాడు.

ఆ యాత్రికులు ఆయన మాటని తీసిపారేయకుండా, పండరీపురం వెళ్లగానే స్వామి సన్నిధిలో ఆ మాటలు చెప్పి, తమ పనులలో మునిగిపోతారు. నిర్హేతుక జాయమాన కరుణా కటాక్షం కలిగిన స్వామికి తన భక్తుడి ఆవేదన తెలియదా? దాని గురించి తనకి వేరొకరు చెప్పాలా? ఏకాదశి ఘడియలు రావడం ఆలస్యం; పాండురంగడు తన అంతరంగ భక్తులయిన జ్ఞానదేవుడిని, నామదేవుడిని పిలిచి, "నా పరమ భక్తుడొకనికి దర్శనమివ్వాలి. వెళ్లివద్దాం రండి" అని వారిద్దరినీ వెంటబెట్టుకుని ప్రయాణమై, దారిలో మరొక భక్తాగ్రేసరుడైన సామంతుడనే వానిని అనుగ్రహించి, బహుళాపురం చేరుకొని, కూర్మదాసుకి భక్తసహితంగా దర్శనం ఇస్తాడు. ఇక కూర్మదాసు ఆనందం మాటలతో చెప్పగలమా? జ్ఞానదేవ, నామదేవులతో సహా దర్శనం ఇచ్చాడు స్వామి - ఇదే బోనస్ (Bonus) అన్నమాట!

-సశేషం

# దైవ లీల

- రావి శోభ

ఒక ఊళ్ళో ఉన్న శివాలయం దగ్గర ఒక అంధుడు కూర్చుని ముష్టి అడుక్కుంటూ ఉండేవాడు. అతని ముందు పరచి ఉంచిన పాతబట్ట మీద ఎవరైనా తోచినవాళ్ళు పైసలు వేసేవారు.

ఒకరోజు పరమ లోభి అయిన ధనవంతుడు ఒకడు గుళ్ళోకి వెళ్ళి, దండం పెట్టుకుంటుంటే వానికి ఏవో మాటలు వినవచ్చాయి. అతడు ఆసక్తిగా వినసాగాడు. అది పార్వతీ పరమేశ్వరుల సంభాషణ. "దేవీ! గుడి బయట అడుక్కుంటున్న అంధుని చూస్తే జాలికలుగుతోంది. వానికి నువ్వు ఏదైనా ధన సహాయం చెయ్యకూడదా!'' అని పరమేశ్వరుడనగానే "స్వామీ! తమ ఆజ్ఞ'' అంటూ పార్వతీదేవి గజాననుని పిలిచి "కుమారా! మీ తండ్రిగారి మాటలు విన్నావు కదా! బిచ్చగాడికి డబ్బులు వచ్చే ఏర్పాటు చెయ్యి'' అన్నది. "ఈ సాయంకాలంలోపుగా అతనికి లక్షరూపాయిలు యిస్తానమ్మా!'' అన్నాడు గణపతి.

వారి మాటలన్నీ శ్రద్ధగా విన్న ధనవంతునికి పరమానందమైంది. వెంటనే ఆ గ్రుడ్డివాని దగ్గరకువెళ్ళి "చూడబ్బీ! నీకు సాయంకాలంలోగా ఎన్ని డబ్బులొచ్చినా అవన్నీ నాకు ఇవ్వు'' అన్నాడు. వాడు ఆ మాటలు వింటూ అడిగేవాడెవడో తనకు కనబడక పోయినా, "నాకేం వస్తాయి తండ్రీ! రోజుకి రెండో మూడో రూకలు అంతే! అయినా బిచ్చగాడి దగ్గర బిచ్చం అడుక్కుంటున్న మీరెవరు?'' అన్నాడు. "నేనెవరైతే నీకేమి? ముందుగానే నీకు పదివేలిస్తాను. నా మాట విను'' అన్నాడు ధనవంతుడు బ్రతిమాలుతూ. తాను పదివేలు వానికిచ్చినా, గణపతి వానికిచ్చే లక్షరూపాయలలో తొంభైవేలు తనకి మిగులుతాయని వాని ఎత్తు. ముష్టివాడు తెగఆశ్చర్యపడుతూ ' సరే!' అన్నాడు.

తానన్న ప్రకారం వాడికి పదివేలిచ్చి తానూ వాని ప్రక్కనే తిష్ఠవేసి కూర్చున్నాడు. ఆశపోతు అయిన ధనవంతుడు. కాలం గడుస్తోంది. సాయంత్రం అయింది. కానీ వాడి బట్ట మీద డబ్బులేమీ పడలేదు. చీకటి కూడా పడబోతుంటే ధనవంతునికి ఓపిక నశించింది.

కోపంతో చరాలున లేచి గుళ్ళోకి వెళ్ళి ఎత్తి పొడుపు మాటలతో గణపతిని "ఏదీ! గ్రుడ్డివాడికి లక్షరూపాయలిస్తానన్నావే. ఇంతవరకూ పైసారాల్చలేదు. మాట తప్పిన వాడివి. నువ్వేం దేముడివయ్యా!'' అంటూ బొజ్జ మీద ఉన్న ఉన్న బొడ్డులో వేలుపెట్టి పొడిచాడు. అంతే! చటుక్కున ఆ వేలు బొడ్డులో ఇరుక్కుపోయింది. ఎంత విలవిలలాడినా వేలు ఊడిరాలేదు.

అప్పుడే పార్వతి ''నాయనా! అన్నమాట ప్రకారం డబ్బులిచ్చావా?'' అన్నది కొడుకుతో. "ఇప్పటికి పదివేలిచ్చానమ్మా! మిగిలిన తొంభైవేలు వానికిస్తేగాని యీ దురాశాపరుడైన ధనవంతుని వేలు నా బొడ్డు నుంచి ఊడిరాదుగా!" అన్నాడు గణపతి తల్లితో. ఆ మాటలు వింటూ లబలబలాడుతూ ధనవంతుడు లెంపలు వాయించుకున్నాడు.

ఎప్పుడే జీవుడికి ఏ విధంగా ఏది ప్రసాదించాలో దయామయుడైన ఆ దైవానికే ఎరుక!!

ఒక సాధువు బజారులో నడుస్తుంటే ఎదురుగా వచ్చిన ఒక కోటీశ్వరుడు ఆయనకు నమస్కరించాడు.

"నా కెందుకు నమస్కరిస్తున్నావు?" అని స్వామి అడిగాడు.

"మీరు సర్వసంగ పరిత్యాగులని" సమాధానం చెప్పాడు ఆ వ్యక్తి.

"నేనేం త్యాగం చేశాను సంసారాన్ని. మరి నువ్వో! భగవంతుడినే త్యజించావు. నువ్వే నా కంటె చాల గొప్ప త్యాగివి" అంటూ ఆ స్వామి తిరిగి నమస్కరించాడు.

తల తిరిగిపోయిన కోటీశ్వరుడు మౌనంగా నిష్క్రమించాడు.

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

11-6-1985

శ్రీబాబు ఈరోజు ఉదయం భక్తులనుద్దేశించి మాట్లాడుతూ మానవుడు జీవభ్రాంతి, దేహభ్రాంతి, దారాపుత్రాదుల భ్రాంతి వలన తనకి, తన పిల్లలకి నూరు సంవత్సరాలకి సరిపోయినంత పథకాలని తయారు చేస్తాడు. పెద్ద భవనం కడతాడు. ఎంతో ధనాన్ని ఆర్జిస్తాడు. ధనాన్ని కూడ పెడతాడు. ఈ దృశ్యా ప్రపంచం, భోగభాగ్యాలు సత్యమనుకుంటాడు. **యదృశ్యం తన్నశ్యం** ఈ కనబడేదంతా నశించేదే. **బ్రహ్మసత్యం జగన్మిధ్య** అనే మహాత్ముల బోధ వింటారు. కాని సత్యాన్ని బోధించిన జ్ఞానిని పిచ్చివాడు, ఏదో మాట్లాడుతున్నాడు. ఈ కనబడే దృశ్య ప్రపంచాన్ని మిధ్య అంటాడేమిటి? అని వ్యాఖ్యానిస్తాడు ఆ అజ్ఞాని. ఈ ఇరువురిలో ఎవరు పిచ్చివాడు? ఎవరి పిచ్చి వారికానందం. దృశ్య ప్రపంపచమే సత్యమయితే మీ తాతగారు ఏరి? మీ నాన్నగారు ఏరి? నీవు మాత్రం ఎంతవరకు?

నేను, నాది అనుకుంటున్నావు కదా! దాని వెనుక సత్యమైన శాశ్వతమైన పరిణామం లేని 'నేను' ఉన్నది. దానిని తెలుసుకోవటానికి ఇంత గొడవ ఎందుకయ్యా అని నా దగ్గరకు వచ్చిన ఒక వ్యాపారస్థుడికి పోనీలే బాగుపడతాడు కదా అని చెబితే వింటాడా? బాబుగారూ నేను ఉన్నాను కదండీ. నా ధాన్యం వ్యాపారం ఉంది. దాన్ని లేదని ఎలా అనుకోమంటారు? నేను మీ దగ్గర అబద్ధం ఆడను. బియ్యంలో రాళ్ళు కలిపాను. 1000 బస్తాలు ఎక్స్‌పోర్ట్‌కి ఆర్డర్ వచ్చింది. 100 బస్తాల రాళ్ళు కలిపాను. నన్ను పట్టుకున్నారు. నాకు రావలసిన 25000 లాభం రాకపోగా ఇంకా 25వేలు నష్టపోయాను. దీని నుంచి నన్ను రక్షించండి. మీకు ఏదో కానుక సమర్పించుకుంటాను' అన్నాడు. అప్పుడు నువ్వు చేసిన తప్పుకు పశ్చాత్తాప పడితే రక్షింపబడతావు అన్నాను నేను. అయితే ప్రజెంట్‌లో పశ్చాత్తాప పడమంటారా? ఫ్యూచర్‌లో పడమంటారా? అని అడిగాడు.

అలా అయితే భవిష్యత్తులో కూడా ఇలాగే వ్యాపారం చేస్తావా? అని ప్రశ్నించి, నీకు జ్ఞాపకం వచ్చినప్పుడు టెంకాయ కొట్టి సంకటములకు గురైనప్పుడు ఓ భగవంతుడా! రక్షించు అంటే ఎలాగయ్యా? గురువాజ్ఞను పాలించు. ఫలితం కలుగుతుంది. ఆశ ఉన్న మానవుడికి శాంతి లేదు. అందు వలననే శంకరభగవత్పాదులవారు అన్నారు ఆశని జయించినవాడే

భాగ్యవంతుడు అని.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ నీకు టెంకాయ కొడుతున్నా నా పని కాకపోతే నీకు ఏమన్నా అప్పు ఉన్నానా? నీకు రోజూ నివేదన చేస్తున్నా నామీద దయ చూపవు! నా మీద దయ చూపకపోతే నీ ఫొటో తీసి అవతల పారవేస్తా. నా చేతి ఉంగరంలో కూడా ఉన్నావు కాబట్టి ఆ ఉంగరాన్ని కూడా తీసిపారవేస్తా అంటాడు. కారు డ్రైవ్ చేస్తూ తన ప్రక్కనున్న ఇల్లాలితో మీ నాన్న మనకి ఏమి ఇచ్చాడు అని అంటే ఏమి జరుగుతుంది? అందరికీ మోక్షమే కదా! అలాకాకుండా దృష్టిని డ్రైవింగ్ మీద ఉంచాలి. అవసరం వచ్చినప్పుడు భగవంతుని స్మరించి, లేనప్పుడు విస్మరిస్తే ఏం ఫలితం ఉంటుంది? 'నీ ప్రారబ్ధ కర్మ నీ కంటే ముదిరిపోయింది. నేను మీకు సహాయం చేయటానికి సిద్ధంగానే ఉన్నా. దాన్ని అందుకోవటానికి నీ గుణాలు అడ్డు వస్తున్నాయి అంటాడు భగవంతుడు. కాబట్టి మనసారా విశ్వాసంతో ధ్యానిస్తే తప్పక తరిస్తావు. దీనికి ఒక ఉదంతం చెప్తాను.

తిరుపతిలో కపిల తీర్థం దగ్గర ఒక పాడుబడ్డ దేవాలయంలో ఒక హరిజనుడు ఉండేవాడు. కాళ్ళు చేతులు కదలవు. అతని పేరు రామదాసు. అతనికి నిత్యం ఆ దేవాలయంలో ఎవరో ఒకరు ప్రసాదం పెట్టేవారు. ఒకసారి నేను హరేరామ హరేరామ రామరామ హరేహరే అనుకో అని చెప్పాను. అతని జన్మ సంస్కారం గొప్పది. నిరంతర నామ స్మరణ చేసేవాడు. రెండు నెలలలో చేతులతో భజన చేయడానికి శక్తి వచ్చింది. కొద్ది రోజులలోనే నడవటానికి కాళ్ళకు శక్తి వచ్చింది. నెమ్మదిగా ఎలాగో ఏడు కొండలూ ఎక్కి తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించాడు.

తిరుపతిలో అన్నారావుగారని ఉండేవారు. ఆయన రోజూ రామదాసుకి ప్రసాదం పెట్టేవారు. అతను ఎప్పుడూ నృత్యం చేస్తూ భజన చేసేవాడు. ఇలా ఉండగా నేను ఒకసారి తిరుపతి సందర్శించటానికి వెళ్ళినప్పుడు నాతోపాటు నాగేశ్వరరావుగారు, వేంకటస్వామిగారు వచ్చారు. నేను దూరంగా నిల్చుని రామదాసుకి 5రూపాయలు ఇచ్చి రండి మీ జన్మ సార్థకం అవుతుంది అని నాగేశ్వరరావుగార్కి, వేంకటస్వామిగారికి చెప్పాను. వారు డబ్బు ఇవ్వబోతే అతను వెక్కి వెక్కి ఏడుస్తూ డబ్బు నాకు వద్దు ఆ గోవిందుడికి ఇవ్వండి మిమ్మల్ని పంపిన ఆయన నన్ను పరీక్షించడానికి పంపాడు అన్నాడు. చూశారా! భక్తుడు ఎన్నడైనా ధనానికి అమ్ముడుపోతాడా? అదే ధనాన్ని ఉపన్యాసాలు దంచే పండితుడికి ఇవ్వండి ఏం సమాధానం వస్తుందో మీరు ఇచ్చేది ఇంతేనా? ఇంకా ఎక్కువ ఇస్తారనుకున్నాను అంటాడు.

-సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**జనవరి 2012**

**1 ఆదివారం** ఇంగ్లీషు సంవత్సరాది, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

**5 గురువారం** వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి),శ్రీ సద్గురు పాద పూజఉత్తర ద్వార దర్శనం, ఏకాహం, భక్త సమారాధన

**9 సోమవారం** పూర్ణిమ, శ్రీసద్గురుపాదపూజ

14 శనివారం భోగి పండుగ, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన. రాత్రి 8 గంటలకు శ్రీ సద్గురుదేవులకు భోగి పళ్ళు పోయుట

**15 ఆదివారం** మకర సంక్రాంతి,(ఉత్తరాయణ పుణ్యకాలం),శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

**16 సోమవారం** కనుమ, శ్రీ సద్గురు పాద పూజ.

**18 బుధవారం** శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

**21 శనివారం** మాసశివరాత్రి

**30 సోమవారం** రథసప్తమి

**ఫిబ్రవరి 2012**

**3 శుక్రవారం** భీష్మ ఏకాదశి, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం. పెద నింద్రకొలను శాఖలో శ్రీ సద్గురు దేవుల దివ్య మంగళమూర్తి సప్తమ ప్రతిష్ఠా వార్షికోత్సవం. శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

**7 మంగళవారం** మాఘ పౌర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

**17 శుక్ర వారం** శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

**20 సోమవారం** మాసశివరాత్రి., మహా శివరాత్రి, తె.ఝా. 3 గం.లకు బృందావనంలో శ్రీ గురుదేవులకు రుద్ర,నమక, చమక సహితంగా అభిషేకం 4 గం.లకు మహన్యాసము, 5గం.30 నిలకు శ్రీ సద్గురు పాదపూజ, 7గం.30 నిలకు సామూహిక రుద్రాభిషేకములు, 11గం.లనుండి శ్రీ రామలింగేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన, రాత్రి 6.గం. 30ని.లకు శ్రీ మహాకాళికాపరమేశ్వరీ రామలింగేశ్వరుల నగరోత్సవము రాత్రి7గం.30ని.లకు లీలా కళ్యాణము.

**24 శుక్రవారం** శ్రీ లలితానంద సరస్వతి స్వామినివారి పుణ్యారాధన మహోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, ఆరాధన కార్యక్రమము.

# భక్తి విజయం

(గతసంచిక తరువాయి) - సుశీలా ప్రసాద

చండకుడు నీళ్ళు నిండి, ఎర్రబడిన కళ్ళతో ఏమిటన్నట్లు ఆమె వైపు చూశాడు. "మరి శ్రద్ధగా విని అలా చేయాలి" అన్నది మళ్ళీ. తల ఊపాడు తన మాట జవదాటని పతివ్రత అయిన భార్యమాట వినటానికి సిద్ధపడుతూ. "నానా విధాలైన కట్టెలతో కట్టబడిన యీ యింటికి నిప్పంటించి, నేను ఆ అగ్నిలో ప్రవేశిస్తాను. అందువలన శ్మశాన భస్మం మీకు లభిస్తుంది" అంటున్న భార్య మాటలకు చండకుడు చలించిపోయాడు.

"ఈ శరీరం ఉన్నది ధర్మ సాధన కోసమే కదా! నీకేమో యింతవరకు బిడ్డా, పాపా కలగలేదు. నగలు పెట్టుకుని అలంకారాలు చేసుకొనే సుఖాలు కూడా ఎరుగనిదానివి. అటువంటి భోగాలు అనుభవించ దగిన నీ దేహాన్ని విడువటానికి నీకెలాగ యింత కోరిక కలిగింది?" అంటున్న భర్త మాటలకు ఆమె చిరునవ్వు నవ్వింది. "పరుల కోసం ప్రాణాలు విడిచిన వారి జన్మ సార్థకమైంది కదా! అలాంటప్పుడు మహాదేవుడైన శివుని కోసం స్వయంగా ప్రాణాలు అర్పించటం కన్నా వేరే ఘనత ఏముంటుంది? పూర్వ జన్మలో నేను గొప్ప తపస్సు చేసి ఉంటాను. లేక మహాదానాలేవో చేసి ఉంటాననే నా నమ్మకం. కాకపోతే భగవంతుని కోసం ప్రాణాలిచ్చే గొప్పదనం కలగదు. పూర్వ జన్మలో నేను శివ పూజ చేసి ఉండవచ్చును".

భార్య నిశ్చయ వాక్కులకి, స్థిరబుద్ధికి శంకరుని యందు గల అచంచల భక్తికి చండకునికి ఎంతో సంతోషం కలిగింది. దృఢమైన సంకల్పంతో "నీవన్నట్లే జరగనీ" అంటూ తాను పూజకి ఉపక్రమించాడు.

కిరాతుని భార్య భర్తకు నమస్కరించింది. విశుద్ధమైన మనస్సుతో యింటికి నిప్పంటించింది. భక్తితో అగ్నికి ప్రదక్షిణ చేసి, శివునికి నిర్మలమైన మనస్సుతో నమస్కరించింది. "ఓ దేవా! నా యింద్రియాలు నీకు పూలు కావాలి. యీ శరీరం అగరు ధూపము, హృదయము దీపము, ప్రాణాలు హవిస్సు, కరచరణాలు నూతన అక్షతలు అయి, యీ నా జీవుడు పూజా ఫలమును ఇప్పుడు పొందును గాక! నేను భూమండలాధిపత్యాన్ని కోరను, స్వర్గంలో స్థిరంగా నివసించాలనే కోరిక కోరను. బ్రహ్మపదము అసలే అక్కర్లేదు. కాని నాకు తిరిగి జన్మ ఉంటే ఓ శంకరా! నీ దివ్య పాదపద్మములందలి మకరందాన్ని గ్రోలే ఆడ తుమ్మెదగా జన్మించాలని కోరుతున్నాను. నాకెన్ని

వేల జన్మలు వచ్చినా రానీ, అజ్ఞాన కారణమైన మాయ మాత్రం నా చిత్తంలో ప్రవేశించకుండా చేయి. ఇదిగాక నా హృదయమొక అరక్షణమైనా నీ పాదారవిందమును విడువకుండుగాక! శంకరా! నీకు నమస్కారము".

ఇలాగ ప్రార్థించిన ఆ కిరాతాంగన అగ్నిలో ప్రవేశించి దగ్ధమై పోయింది. చండకుడు ఆ భస్మాన్ని గ్రహించి, తగులబడిన తన యింటి ముందే నిశ్చలచిత్తంతో శివపూజ చేశాడు. పూజ పూర్తి అయినాక నిత్యమూ ప్రసాదం తీసుకోవడానికి వచ్చి, వినయపూర్వకంగా తలవంచి దోసిలొగ్గి నిలిచే తన భార్యను తలచుకున్నాడు.

అతడలాగ తలచిన క్షణానే మునుపుటి వలెనే మామూలు శరీరంతో చిరునవ్వుతో భక్తితో తన వెనుక తలవంచి వినయంగా దోసిలొగ్గి నిలిచి ఉన్న భార్యను చూశాడు. అలాగే దగ్ధమైన యిల్లు కూడా మునుపటి వలెనే మామూలుగా ఉంది. ఇది కలా నిజమా తన భ్రాంతి కాదుగదా అనుకున్నాడు చండకుడు. "భస్మమైనదానివి తిరిగి ఎలా వచ్చావు?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు భార్యను. ఆమె యిలాగని సమాధానం చెప్పింది. "ఇంటిని దగ్ధం చేసి అగ్నిలో నేను ప్రవేశించగానే నాకు అగ్ని కనబడలేదు. నా ఒంటికి వేడి తగలలేదు. అమృతంలో మునిగినట్లుగా ఉంది. నిద్రపోయి ఒక క్షణంలో మేల్కొన్నాను. ఇల్లు మామూలుగానే ఉండటం చూశాను. ఇప్పుడు శివపూజానంతరం ప్రసాదం తీసుకోవడానికి వచ్చాను"యిలాగ ఆనందంగా అన్యోన్యంగా మాట్లాడుకుంటున్న ఆ దంపతుల ముందుకు ఒక విమానం వచ్చింది.

నూరుగురు చంద్రులులాగ ప్రకాశించే నలుగురు ఈశ్వర భటులు వారిద్దరిని సశరీలుగా విమానం ఎక్కించారు. ఆ ఈశ్వర భటుల స్పర్శతో వారి శరీరాలు శివసారూప్యం మొందాయి. ఇలాగ భక్తితో శ్రద్ధతో శివపూజ చేసిన ఆ పుణ్య దంపతులు శివలోకం పొందారు.

సర్వ మానవులలోనూ ఉత్తమమైన జన్మతో ఏం ప్రయోజనం? వేదశాస్త్ర పురాణ విమర్శగల విద్యతో ఏం ప్రయోజనం? ఏమి లేదు. ఏ మానవుని హృదయంలో పరమేశ్వర భక్తి ఉంటుందో అతని కంటె ముల్లోకాలలోనూ ధన్యుడైన పురుషుడు ఉంటాడా? లేదు ముమ్మాటికీ లేదు. (స్కాంద పురాణాంతర్గత బ్రహ్మోత్తర ఖండము 17, అధ్యాయంలో 'భక్తి మహిమోపాఖ్యానం' ఆధారంగా)

# గురు కృపాహి కేవలమ్

(గతసంచిక తరువాయి) సేకరణ-రమణ ప్రసాద్

ఈ అహంకార మమకారాలు రెండూ ఎలా పోతాయి? కేవలం సద్గురుమూర్తికి దాసోహం అవటం వలన, గురుకృప వలన, గురువాక్య పరిపాలన వలన అది జరుగుతుంది. ఇది నిజమురా! ఇదే సత్యమురా! అని అట్టి మహోన్నత భావాన్ని మనకందించి, చివరి చరణంలో జాగ్రత్త ఖబర్దార్! అని చెబుతున్నారు. కామ క్రోధ మద లోభ మోహ మాత్సర్యాలు అనే ఆరు శత్రువులు నీలో ఉన్నాయి చూశావా, అవి నీకు కనబడకుండానే నిన్ను కబళించి వేస్తాయి. వాటికి నీవు దాసుడవైపోతావు. ఆ ఆరు పొరలు నీ దృష్టిని కప్పివేస్తే ఇక నీకు సత్యమార్గం ఎక్కడ కనబడుతుంది? అయితే అప్పుడు కూడా ఒక ఉపాయం ఉంది. అటువంటి సమయంలో కూడా నిన్ను రక్షించేది ఒక్క గురుపాదము మాత్రమే సుమా! కనుక ఆ మాధవుని (గురుమూర్తిని) స్మరించరా.

చూశారా! ఎంత చక్కని బోధో! మరి ఇంత బోధ మనకి గురుమూర్తి అందించటానికి ఒక కారణంగా అక్కడ నిలిచిన శ్రీమతి సువర్చలమ్మగారి గురించి కూడా కొంచెం చెప్పుకుందాం. ఆవిడ టెలిఫోన్ ఆపరేటర్‌గా పనిచేసి రిటైర్ అయి మా ఆశ్రమంలోనే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. పాపం! ఆవిడ చివరిలో క్యాన్సర్ వ్యాధితో చాల బాధ పడ్డారు. ఆవిడకి బాబు దగ్గర నుండి లక్ష్యార్థం తీసుకోవాలని చాలా గాఢమైన కోరిక ఉండేది. మరి బాబుతో డైరెక్ట్‌గా చెప్పే అవకాశం దొరకకో లేక భయం చేతనో నా దగ్గరకు వచ్చి, ప్రతిరోజూ ఉదయం “అమ్మా! చంద్రా! నువ్వు చెప్పమ్మా బాబుగారితోటి నాకు లక్ష్యార్థం ప్రసాదించమని” అని అనేవారు. సరే నేను రాయబారం చేసేదాన్ని. ప్రతిరోజూ బాబుగారితో ఆవిడ మాట చెప్పేదాన్ని. ఆయన విని ఊరుకునేవారు. ఏమీ మాట్లాడేవారు కాదు. స్వామి ఏమన్నారని ఆవిడ మాటిమాటికి నన్ను అడిగేవారు. “అమ్మా! నేను చెప్పాను. ఆయన విన్నారు, మీరేమీ భయపడకండి. ఆయన తప్పక అనుగ్రహిస్తారు” అని నేను అనేదాన్ని.

ఇంతలో ఆవిడకి తుదిగడియ రానే వచ్చింది. కన్ను మూసింది. శ్రీబాబు లక్ష్యార్థం ఇవ్వనేలేదు.

ఉండండి, ఉండండి! అప్పుడే కథ అయిపోలేదు.నేను ఊరు కుంటానా? వెళ్ళి శ్రీబాబుతో "అయ్యో పాపం! సువర్చలమ్మగారు పోయారు. లక్ష్యార్థం తీసుకోవాలని ఎంతో అనుకున్నారు. పాపం! ఇక యీ జన్మకి ఆ అదృష్టం లేదుకదా!" అన్నాను. ఆయన వెంటనే తీవ్రంగా "ఏం సువర్చలమ్మకి ఏం తక్కువైంది? ఆఖరి శ్వాస వదిలేటప్పుడు ఆమె లక్ష్యం దేనిమీద ఉంది? "బాబూ!" అని శ్వాస వదిలింది. మరి బాబు అంటే ఎవరు? ఏదో లక్ష్యార్థం తీసుకున్నాం అంటే, తీసుకుని దాన్ని బుట్ట దాఖల చేసి విస్మరించేకంటే, తీసుకోకుండా అయినా చివరి క్షణం వరకూ ఆవేదనతో 'అయ్యో! నా గురుమూర్తి ముద్ర నాకు లభ్యం అవ్వలేదే! ఎప్పుడు నా గురుదేవుడు నన్ను అనుగ్రహిస్తారో కదా!' అని స్వాతి చినుక కోసం నోరు తెరచుకుని ఉన్న ముత్యపు చిప్పలా ఆ గురుమూర్తి మీదే ఏకైక దృష్టిని నిలిపి అంతిమ శ్వాస వదిలితే ఇక లక్ష్యం ఎక్కడ నిలిచినట్లు? ఆ జీవుడికి మరో జన్మ ఏదీ?" అన్నారు.

మంత్ర మూలం గురోర్వాక్యం అన్నది గురుగీత. గురుదేవుల నోటి నుండి వచ్చిన ప్రతి వాక్కూ మంత్రమే. దానిని ఆచరిస్తే చాలు. మనం తరించటానికి. మన ఆశ్రమంలో మనం చూస్తున్నాం ఎవరుపోయినా అంతిమ శ్వాస వదిలేటప్పుడు" బాబూ!" అంటూనే వెళ్ళిపోతున్నారు. ఇక వారు ఎక్కడికి వెడతారు? ఆ గురుమూర్తిలోనే లీనమైపోతారు. అటువంటి తీవ్ర వైరాగ్యము, ఆవేదన గురుదేవుల యందు అచంచలమైన భక్తి కలిగినవారికి మోక్షము కరతలామలకమే!

**కొండపై ఇల్లు కట్టుకుని మృగాలకి భయపడితే ఎలా? సముద్రపు గట్టున ఇల్లు కట్టుకుని నురుగు తరంగాలకి భయపడితే ఎలాగ? సంతలో ఇల్లుకట్టుకుని శబ్దాలకు సంకోచిస్తే ఎలాగ? లోకంలో పుట్టిన తరువాత స్తుతి నిందలు వచ్చినా మనస్సులో కోపింపకుండా నెమ్మదిగా ఉండాలి.**

**- మహాదేవి యక్ష కర్ణాటక వచనాలు**

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గతసంచిక తరువాయి) -సుశీలా ప్రసాద

"నా మనోనాధుడు చూస్తుండగానే మాయమైనాడే! ఎటువెళ్ళాడో!" అని వెతుకుతూ బయలుదేరింది తరుణి. అలాగ చూస్తూ యమమునా నదీ తీరానికి వెళ్ళింది. దూరం నుంచే గోపబాలుని చూసి ప్రక్కన ఎవరో ఉన్నారని చూడాలని చాటుమాటుగా ముందుకి నడిచింది. దగ్గరకి వెళ్ళి చూస్తే కన్నయ్య నీడే ప్రక్కన వెన్నెలలో. సిగ్గుపడింది.

"తరుణీ! నీ కోసమే చూస్తున్నాను. నువ్వు నన్ను వెతుకుతూ వస్తావని నాకు తెలుసు. ఈ యిసుక తిన్నెలపైన కొంతసేపు ఆటలాడదామని నీతో. మరి యీ యిసుకలో చిన్న చిన్న గూళ్ళు కడదామా?" తరుణి కన్నయ్య మాటలకు సంతోషంతో ఒప్పుకుంది.

పక్కపక్కనే కూర్చుని యిసుకలో యిద్దరూ చక్కని గూళ్ళు కట్టారు. ఎవరు బాగా కడతారోనని పందెం వేసుకుంటూ పూర్తిఅయ్యేలోగా యమున కుతూహలంగా చూసిరమ్మన్నట్లు ఒక పెద్ద కెరటాన్ని పంపింది. అది వచ్చి గూళ్ళని తనలో కలిపి తీసుకుపోయింది.

చిన్న బుచ్చుకున్న తరుణి ముఖం చూస్తూ చుబుకాన్ని ఎత్తి పట్టుకుని వంశీధరుడు "చూశావా! జీవులు ఎన్నెన్నో కలలు కంటారు. తమ సంకల్పాలన్నీ నెరవేరాలని అనుకుంటూ గట్టి ప్రయత్నాలు చేస్తుంటారు.

కానీ ఒకనాడు మృత్యువు అవన్నీ హరిస్తూ ఆయువుని ముగించి వేస్తుంది. ఇదిగో యీ గూళ్ళు లాగే జీవులు కూడా కాలగర్భంలో కలిసిపోతారు. నన్నాశ్రయించి, నన్నే నమ్మి ఉన్న మీరంతా యీ సకల సృష్టికి కర్త, భర్త, హర్తగా నన్ను తెలుసుకుని తరించి నాలో ఐక్యం అవటానికే రోజు రోజూ మీతో యిలాగ ఆటలు పాటలు కల్పించుకుంటూ మీ వెంటే ఉంటున్నాను. మీ నిర్మల హృదయాలలో నాపైగల గాఢానురాగమే పాశమై నన్ను మీతో బంధించివేసి, మీకు ముక్తిని ప్రసాదిస్తున్నది".

వ్రజవల్లభుని పలుకులు వింటూ తరుణి మనస్సు తలుపులు తెరిచింది. అందులో ప్రవేశించిన నందబాలుడక్కడ అఖండంగా ప్రకాశిస్తున్నాడు.

మధుర అతి మధురంగా నవ్వుతుంది గనుకనే ఆమె కాపేరు సరిపోయింది. గోపాలబాలుడు సంపెంగ చెట్టు చాటున దాక్కున్నాడు. మధుర మల్లెపొదలమాటున, మాలతీతీగల వెనుక వెదికింది. అప్పుడామె అధరాలపైన సంపెంగ పువ్వొకటి వచ్చి వాలింది.

అది గమనించిన మధుర పెదిమలపై చిరునవ్వుతో సంపెంగ చెట్టును చేరి దొంగను పట్టేసింది. గట్టిగా కౌగలించుకుని "ఇంకెక్కడకి వెడతావయ్యా?" అంది. ముసిముసిగా నవ్వాడు నందనందనుడు. అలాగ ఆలింగనానందాన్ని అనుభవిస్తూ మధుర "నీ యీ స్పర్శలో కాలమతీతమైనదిగా అనిపించి, మైమరిపిస్తున్నది. నీ తీయని పెదవులపై నిలిచిన వేణువు ద్వారా నీ వందిస్తున్న బోధామృతాన్ని నీ అధరామృతంగా ఆస్వాదిస్తూ మేము పొందుతున్న గొప్ప స్థితి ఏమిటో చెప్పమంటావా?"

గోపికల మనస్సులలో జ్ఞానకాంతులను నింపుతున్న అఖండ తేజోస్వరూపుడు మధుర వాక్కులలో తానే నిండి ఆమె చేత పలికిస్తున్నాడు. "మా యిళ్ళకి వెళ్ళినా, ఏ పని చేస్తున్నా, ఏతావున తిరుగుతున్నా ఎటువైపు చూసినా సర్వే సర్వత్రా నీ రూపమే గోచరిస్తున్నది సుమా! నీ నుంచి వియోగమనే మాటను మేము విసర్జించి వేశాము. ఇక మాకు విషాదమెక్కడిది? అంతా ఆనందమే. నీవు నేను ఒక్కటైన బ్రహ్మానందమే".

తాను కన్నయ్య కంటే వేరుగా లేనని, వేరుకాదని తెలుసుకుంటూ తన్మయత్వంతో పలుకుతున్న మధురను, మధురాధిపతి అయిన పరమాత్మ మందహాసం చేస్తూ చూస్తూ "మీకిక పునర్జన్మ లేదు" అన్నాడు.

అది కిశోరమూర్తి అయిన బాలకృష్ణుడు అరమోడ్చిన కనుదమ్ములు గల అందమైన ముఖములు గల గోపికలతో విహరిస్తూ వేణుగానం చేస్తూ ఉన్న వాని విలాసచేష్టలు నా చిత్తంలో ఆవిర్భవిస్తున్నాయి. ఈ భాగ్యమీతీరుననే లభించుగాక!!

-సశేషం

పచ్చి పొగరుతో గాయపరచిన వానిని, ఉదార బుద్ధి ప్రకటించే విధంగా జయించాలి. అదే ధర్మం. మరొకదారి త్రొక్కరాదు.

- కురల్

## పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

దారాపుత్రాదులను ప్రేమించటం మమకారమనిపించుకుంటుందా? అలా అయితే గృహస్థాశ్రమం సాధనకి ఉత్తమమం అంటారు కదా?మరి గృహస్థాశ్రమంలో ఉంటూ దారాపుత్రాదుల యందు మమత్వం లేకుండా ఎలా ఉండటం? అన్న సందేహానికి శ్రీగురుదేవులు సమాధానం చేబుతూ............

"సద్గురుమూర్తిని ఆశ్రయించి ఉన్నవారు మనస్సుని వేరొక వస్తువుపైగాని, వ్యక్తిపైగాని మరల్చవలసిన పని లేదే అని చేసిన హెచ్చరికలో సందర్భము వేరు. మమకారం వేరు, ప్రేమ వేరు. మమకారం స్వార్థ పూరితమైనది. నేను, నాది, నా కులం, నా గోత్రం, నా మతం, నా కుటుంబం అని పరిమితి విధించుకుని ప్రవర్తించటం స్వార్థంతో కూడినది. అక్కడ ప్రేమకి తావులేదు. ప్రేమ స్వార్థపూరితమైనది కాదు. ఒక వస్తువునిగాని, ఒక వ్యక్తినిగాని ప్రేమించటం వేరు. ప్రేమ త్యాగాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రేమ నిష్కళంకమైనది.

మీరు దూరదేశం నుండి చాల ధనాన్ని వెచ్చించి ఒక బొమ్మ తెచ్చారు అనుకుందాం. ఆ బొమ్మని మీ పిల్లవాడు ఆడుతూ కొద్దిగా పాడుచేశాడు అనుకోండి. మీరు కోపంతో ఆ బొమ్మను గిరవాటువేసి, పగులగొట్టి బాధపడి పోయి, పిల్లలను దూషించిన సంఘటనలో పిల్లలపై మీ ప్రేమ ఏమైపోయింది? దానిని ఏమంటారు? పిల్లలు బొమ్మని పాడుచేసినంత మాత్రాన కోపగించు కోవలసిన అవసరం లేదే! అదే నిజమైన ప్రేమ అయితే అక్కడ త్యాగం చేయ గలుగుతారు. కాని అది ప్రేమ కాదు. అక్కడ ఆ బొమ్మ మీద మీరు మమకారం పెంచుకున్నారు. మమకారం స్వార్థపూరితమైనది. తాము ఎంతగానో ప్రేమిస్తున్న భార్యా పిల్లలతో కూడి సంసారంలో కష్టాలు కల్గినప్పుడు విసుగు చెంది 'నేను చచ్చిపోతే పీడ వదులుతుంది' అనుకుంటారు. అలా అనుకున్నవారు ఇక్కడే ఉన్నారు. అది ఏరకమైన ప్రేమ? అది ప్రేమ కాదు మమకారం. పోనీ దేహం త్యాగం చేసినంత మాత్రం చేత తొలగిపోతుందా వ్యధ?

ఈ ఉపాధిని విసర్జించినంత మాత్రం చేత విముక్తి కలుగుతుంది అనుకోవటం శుద్ధ అవివేకం. అనుభవించవలసిన కర్మశేషం సూక్ష్మ శరీరంతోనైనా అనుభవించక తప్పదు. లేదా పునర్జన్మకి తీసుకువెళ్తుంది. కాబట్టి త్యాగం చేయవలసినది కర్మఫలితాన్ని. దేహాన్ని కాదు. కర్మ రహితం అయ్యే మార్గాన్ని అన్వేషించాలి. ఆత్మనింద వలనగాని, పరదూషణ వలనగాని అది రహితం అవ్వదు. సద్గురుమూర్తిని ఆశ్రయించి, ఆయన ప్రసాదించిన మార్గాన్ని ఆచరించటమే సరియైన మార్గము. అటువంటి సాధకుడు మమకారాన్ని త్యాగం చేసి, ప్రేమని పెంపొందించుకుంటాడు. మమత్వమే మోహము. అది దుఃఖమునకు తీసుకు వెళ్తుంది" అన్నారు శ్రీబాబు.

*

శ్రీరస్తు                    శుభమస్తు                    అవిఘ్నమస్తు

# వివాహ మహోత్సవాహ్వాన శుభ పత్రిక

సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాద
బాబూజీ మహరాజ్‌వారి దివ్యాశీస్సులతో
మరియు పూజ్యశ్రీ యోగిని శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీవారి
దివ్యానుగ్రహంతో

**స్వస్తిశ్రీ బ్రహ్మమాన దేశకాలాతీత తిథివార నక్షత్ర శుభ లగ్నమందు**

**వధువు : జీవ - వరుడు : బ్రహ్మము**

| | |
|---|---|
| కళ్యాణ మంటపము | : శ్రీగురుకృప |
| సుముహూర్తము | : మనోసంధాన సమయము |
| మంగళ సూత్ర ధారణ | : లక్ష్యార్థ సిద్ధి |
| మంగళవాయిద్యాలు | : సచ్చింతన, సద్విషయ విచారణ, సత్సంగములు |
| దీపాలంకరణ | : అఖండ జ్ఞాన జ్యోతులతో |
| మంత్రాలు | : సంకీర్తనలు, దైవగుణగానాలు |
| పూలహారాలు | : సత్యం శాంతి దయ ప్రేమ సుమమాలికలు |
| తలంబ్రాలు | : భక్తి విశ్వాస వైరాగ్య అనురాగాలు |
| వధువుకిచ్చే ఆభరణాలు | :శమదమాది షట్కసంపత్తి |
| విందు | : బ్రహ్మానందానుభవ రసామృతము |
| ఆహ్వానితులు | : సాధు సాధక సజ్జన మహాత్ములు |
| విడిది | : ఆనంద మందిరం. |

వివాహమునకు తామెల్లరు విచ్చేసి, వధూవరులను "వారి కాపురం మూడు పూవులు త్రిగుణాతీతమై, ఆరుకాయలు షట్చక్రములనధిగమించి, సహస్రారంలో ప్రకాశించే అఖండ అద్వైత సిద్ధిని పొందుదురుగాక!" అని ఆశీర్వదించి, మదర్పిత వాసుదేవ వాసనా సహిత శ్రీ చందన, శ్రీగురు కటాక్ష ఫల తాంబూలాది సత్కారములను స్వీకరించి, మమ్మానందింపజేయ ప్రార్థన.

ఇవియే అనేక శుభలేఖార్థములు
మంగళమ్ మహత్ శ్రీశ్రీశ్రీ

మీ ఆగమనాభిలాషి
కన్యాదాత సమర్థ చరణారవిందాశ్రిత
శ్రీగురునిలయం

శుభలేఖలు వ్రాసినది : సుశీలా ప్రసాద
అచ్చువేసినది : ముముక్షు ముద్రణ

# శివానందలహరి

-బులుసు మల్లిక్ U.S.A

ఏమి భాగ్యం! మనది. ఏనాడైతే బాలశంకరుడు శ్రీశైల మల్లికార్జుని దర్శన కటాక్ష పారవశ్యంలో మునిగి తేలి, అమితమైన మహదానందంతో తబ్బిబ్బౌతూ శివానందలహరిని జాతికందించాడో ఆనాడు మన తెలుగు తల్లి కూడా పొంగిపోయింది. అటువంటి నేలపై పుట్టడమన్నది మన పురాకృత పుణ్యఫలమనే విషయాన్ని మనమందరం గ్రహించాలి.

శంకరులు ప్రతి రచన అద్వైతామృతాన్నే పంచిపెడుతూ ఉండటం చేత దేనికదే విశిష్టం. ఆయన బుద్ధికుశలత, అలాగే భావస్పష్టీకరణ రీతి, యికపోతే భాషాశైలి అమోఘమైనవి. అలాంటప్పుడు ఒకదానితో వేరొకటిని పోల్చటమన్నది ముమ్మాటికీ న్యాయం కాదు. అయితే లహరి అన్నమాట వినీ వినడంతో ఆస్తిక మహాశయులకు వెంటనే మనస్సులో కదలాడేవి రెండు రచనలే సౌందర్యలహరి మరియు శివానందలహరి. శంకరులు అంతర్ముఖత్వానికి దోహదకములుగా వీటినిమనకందరికి అమర్చిన రెండు అంతఃచక్షువులు అనడంలో ఏమాత్రమూ అతిశయోక్తి లేదు.

ఎందుచేతనంటే '***అంతర్ముఖ సమారాధ్యా, బహిర్ముఖ సుదుర్లభా***' అని కదా వ్యాసవాణి. భాషకి, భావానికి ఎన్నడు కొదవలేదని శంకరులు మరి రెండే లహరులెందుకు అందించారు? ఆయన మూడో లహరి రాయలేక పోయారా? అదే చిత్రము.

'***సత్యం శివం సుందరం***' అన్నది కదా ఆర్యోక్తి. మరి శివాన్ని శివానంద లహరిగాను, సుందరాన్ని సౌందర్యలహరిగాను, రూఢిగా నొక్కివక్కాణించిన ఆదిశంకరులు సత్యాన్ని కూడా సత్యానందలహరిగానో, మరో సత్యలహరిగానో రాయలేరా? రాయరు.

ఎందుచేతనంటే, సత్యము లహరి కావటానికి అది కదలాలి కదా. సత్యం అంటేనే మారనది. అఖండమైనది. భూత భవిష్యద్వర్తమానాలుగా మాయవల్ల మన మాంస చంక్షువులకు భాసించే విశ్వానికి మారకుండా ఆధారమైనదేదైతే ఉందో అదే సత్యం. మరి అదే లహరియై పారితే, లోకాలకాధారమేది? అందుచేతనేమో మరోలహరి రాయలేదు. మరి '***ఏకం సత్ విప్రా బహుధా***

***వదంతి***' అని కదా నానుడి. దాన్నే శంకరులు శివంగా అయ్యనుద్దేశించి, అలాగే సౌందర్యంగా అమ్మనుద్దేశించి మన సేదలు తీర్చే లహరుల రూపంలో తేల్చి చెప్పడం యొక్క వెనుకనున్నటి గూడార్థం కాబోలు.

ఏమీచేతకాని నేను అంతటి మహోత్కృష్టమైన రచననుద్దేశించి, మాయావరిత మనోకల్పితమైన వాక్కులతో ఆస్తికులకు రెండుమూడు మాటలు రాద్దామని ఉబలాటపడటం తుంటరితనమే. భాషాపటిమలేదు. భావం తెలియదు. సత్యవస్తువు యొక్క అనుభూతికాలేదు. ఏవిధంగా చూసినా అనర్థాతే గేలిచేస్తోంది. అయితేనేం? ఓ గుడ్డివాడు తనతల్లిరూపుని ఊహల్లో పిచ్చిగీతలతో సృజించి, చిత్రీకరించుకొని మురిసిపోతాడో, అలాంటి భాగ్యాన్ని మాత్రం కాలదన్నడం ఎందుకు? కాలాన్ని మరో ప్రాపంచిక విషయానికి ముడిపెట్టి ముక్తిమార్గాన్ని నుంచి మరో ఆమడ దూరం పారిపోవడమెందుకు.

ఎందుకంటే అమెరికా పర్యటనాంతర్గతంగా పూజ్యయోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ వాషింగ్టన్ రాష్ట్ర రాజధానియైన ఒలింపియాలో ఉన్న మా స్వగృహానికి విచ్చేయడం, పూజ్య బాబూజీ పలుకులని మా నగర వాసులకి పంచిపెట్టడం, శంకరాచార్యులవారి అద్వైతామృతం పట్ల నాకున్న ఆసక్తికి అమ్మ హర్షం ప్రకటించడం, నన్ను శంకరుని రచనలని దృష్టిలో పెనిట్టుకుని నాలుగు మంచిమాటలు సమర్థ సద్గురు పత్రిక ద్వారా ప్రచురించ డానికి రాయమని ఆదేశించడం నాకు వరంగా భావిస్తూ సాహసానికి తొలి అంజలి చేస్తాను. దీనికి మీరంతా ప్రోత్సహిస్తారన్నదే నా సహృదయ విన్నపం, ఆశయం, నమ్మకం.

***కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం నిజతపః***
***ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం భవతుమే***
***శివాభ్యాం అస్తోక త్రిభువన శివాభ్యాం హృదిపున***
***ర్భవాభ్యాం ఆనంద స్ఫురదనుభవాభ్యాం నతిరియమ్ ॥***

'కలాభ్యాం' అని పార్వతీ పరమేశ్వరుల యిద్దరినీ సంబోధిస్తున్నారు ఆది శంకరులు. ఏది చెక్కుచెదరని సత్యమో అదే కళలగా పరిణమించింది. శివాశువులుగా భాసిల్లింది. '***సా విద్య యా విముక్తయే***' అని కదా నానుడి. ఆ దివ్య జ్ఞానము లభ్యమైతే కాని మోక్షాన్ని పొందలేము.

-సశేషం

# కార్యదురంధరుడు

- సుశీలా ప్రసాద

ఒకరాజు తన వద్ద మంత్రిగా నియమించేందుకు తగిన తెలివైన వానిని అన్వేషిస్తుండగా ముగ్గురు వ్యక్తులు వచ్చారు. వారితో రాజు "మీరు సముద్రం వద్ద ఓడ రేవుకు వెళ్ళి, అక్కడి విశేషాలు ఏమైనా ఉంటే చెప్పండి" అన్నాడు.

మొదటివాడు త్వరగానే తిరిగి వచ్చి, "రాజా! రేవులో లంగరు వేయబడిన మూడు ఓడలున్నాయి. అవి చాలా ఖరీదైన చెక్కతో చేయబడినట్లుగా కనిపించాయి. వాటిమీద రంగులతో దిద్దిన అందమైన పూల లతలు కూడా ఉన్నాయి" అని చెప్పాడు. ఆ మాటలు విని రాజు పెదవి విరచాడు.

కొంతసేపటికి రెండవ వాడు వచ్చాడు. "అయ్యా! ఓడల నిండా సరుకేదో ఉంది. ఆ మూడు ఓడల చుట్టూ జనం వాటిని చూస్తూ తిరుగుతున్నారు. అవన్నీ చూస్తూ కాలం గడిపితే తమకి విన్నవించేందుకు సమయం మించిపోతుందని వచ్చేశాను" అన్నాడు. రాజు అది వింటూ ముఖం ప్రక్కకి తిప్పుకున్నాడు.

మూడవవాడు కాస్తంత ఆలస్యంగానే వచ్చాడు. "మహారాజా! ఓడ రేవులో మనదేశంతో మైత్రి కలిగిన పొరుగు రాజ్యం నుంచి మూడు ఓడలు వచ్చి ఉన్నాయి. వాటి నిండా సరుకులు ఉన్నాయి. చూస్తే ఆ సరుకులు మన ప్రజలకు ఎంతో ఉపయోగకరమైనవిగా ఉన్నాయి. నేను ఓడలో సరుకులు తెచ్చిన వర్తకులను కలుసుకుని వివరాలు కనుక్కున్నాను. వారు చెప్పిన ధరలు సమంజసంగానే ఉన్నాయి. మనం అవి కొనుగోలు చేస్తే లాభదాయకంగా ఉంటుందని ఆలోచించి, అప్పటికి నా దగ్గర కొంతపైకం ఉంటే వారికిచ్చి, సరుకు మనకిచ్చేందుకు ఒప్పందం చేసుకొని వచ్చాను. ఈ వివరాలన్నీ విని తమరు బాగా విచారించి, ఏ నిర్ణయం తీసుకున్నా అది తమ ఆజ్ఞగా భావిస్తాను" అన్నాడు. రాజు ముఖం ఆనందంతో వెలిగిపోయింది!

*పవన సుతుని సీతాన్వేషణకి పంపినప్పుడు, అమ్మవారిని లంకలో వెదికి చూసి, ఆ తల్లితో మాట్లాడి, ఆపైన లంకేశ్వరుని కలుసుకుని హితవు చెప్పి, వాని బలాబలాలను తెల్సుకుని, లంకను కాల్చి వచ్చిన స్వామి కార్యదురంధరుడు మారుతి. అట్టి ప్రజ్ఞాశాలి అయిన సేవకుని వల్లనే ప్రభువు కార్యం నెరవేరుతుంది.*

# శ్రీబాబూజీతో అనుభవాలు

-కోటిపల్లి మామ్మగారు

శ్రీ బాబూజీని దర్శించక పూర్వమే నేను రామ భక్తురాలను. రామ నామం చెవికి సోకగానే ఆనంద బాష్పాలను రాల్చేదానిని. ఒక రోజు రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు నా యిష్ట దైవమైన శ్రీరాముని స్మరిస్తూ "రామా! నీ దివ్య మంగళ విగ్రహాన్ని సాక్షాత్కరించి నన్ను తరింపజేయవా?" అంటూ ఆవేదనతో నిద్రించాను.

ఆ నిద్రలో నేను అపరిశుభ్ర ప్రదేశానికి వెళ్ళాను. జుగుప్స చెందాను. ప్రక్కకు తిరిగి చూసేసరికి ఒక జలాశయం కనిపించింది. స్నానం చేయాలని ఆ జలాశయంలోనికి దిగాను. అందలి జలగలు నా శరీరం పై ప్రాకుతూ పట్టి పీడించ సాగాయి. ఆ దిక్కు తోచని స్థితిలో నేను "రామా! రామా! నన్ను కాపాడు" అంటూ ఎలుగెత్తి పిలిచాను. వేణు నాద స్వరం వినిపిస్తోంది. ఆ నాదం వస్తున్న వైపు తల తిప్పి చూశాను. అక్కడే ఉన్న వట వృక్షం కొమ్మపై కూర్చొని, మరొక కొమ్మ పై తల వాల్చి పడుకొని ఉన్న దివ్య మంగళ విగ్రహం సాక్షాత్కరించింది. ఆయన పాదాల దగ్గర ఒక వ్యక్తి కూర్చొని ఉన్నాడు. ఆ వ్యక్తితో "మూడింటిని తొలగిస్తే ముక్తి కరతలామలకమే" అని ఆ దివ్య స్వరూపుడు అనటం వినిపించింది. అంతలో మెలకువ వచ్చింది.

అంతలో పోతునూరులో ఉన్న మా మనవరాలు "ఇక్కడికి ఒక మహనీయుడు వచ్చాడు. వచ్చి దర్శనం చేసుకో " అని కబురు చేసింది. నేను, మా కుటుంబ సభ్యులతో పయనమై పోతునూరు వెళ్ళాను.

మేము వెళ్ళేసరికి బాబు హాలులో అటూ యిటూ పచార్లు చేస్తూ, ఎవరితోనో మాట్లాడుతున్నారు. హఠాత్తుగా తలత్రిప్పి నా వైపు చూస్తూ "నీవు ఎవరి దర్శనానికై పరితపిస్తున్నావో వాడే వీడు. మూడింటిని త్యాగం చేయగలవా?" అన్నారు.

స్వప్నంలో విన్న మాటలే శ్రీ బాబు ముఖతా వినేసరికి నేను ఆశ్చర్యంలో మునిగిపోయాను. ఆ స్వప్న పురుషుడు బాబే అని నిశ్చయించుకున్నాను. మూడింటిని వదలటం అంటే త్రిగుణాలను వదలటం అని గ్రహించాను. ఆ నాటి నుండి మా కుటుంబం బాబు భక్త కుటుంబము అయిపోయింది. ఈనాటికీ నాకు బాబు బాల కృష్ణునిగానే దర్శనమిస్తూ ఉంటారు. బాబు తన భక్తురాలిగా నన్ను యీ విధంగా వశీకరించుకున్నారు.

# నాడు - నేడు

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

మన హిందూ మతం సర్వోత్కృష్టమైనది. పరమాత్ముడే మూలపురుషుడుగా, వేదాలే మూల సూత్రాలుగా, సర్వలోక హితైషులైన మహాత్ములు, మహర్షులే ప్రవక్తలుగా మార్గదర్శకులైన గురుదేవులుగా భావిస్తున్న మతం యిది. ప్రపంచంలో యిప్పుడు ప్రచారంలోకి వచ్చిన అన్ని మతాలలోని ఉత్తమ సూత్రాలు ఆయా మతాల ఆవిర్భావానికి ముందే మన మతంలో ప్రతిపాదింపబడి ఉన్నాయి.

హిందూమతం సముద్రం వంటిది. మిగతా మతాలన్నీ నదులు, ఉపనదులవలె దానిలో కలిసిపోతున్నాయి. అన్ని మతాలను ప్రకాశింపజేసేది హిందూమతం. అందువల్ల మన హిందూ మతాన్ని కేవలం ఒక మతంగా పేర్కొనడం కంటె సర్వజన సమాదరణీయము, విశ్వజనీనము అయిన ఉత్కృష్ట ధర్మంగా అభివర్ణించటం కద్దు.

కనుకనే హిందూ ధర్మము అన్ని మతాలవారిని ఆదరించ కలిగింది. వారివారి మతాలను శ్రద్ధా భక్తులతో అనుష్ఠించుకోమని, అన్ని మతాలు ఏకైక ప్రభువైన పరమాత్మ వద్దకే చేర్చగలవని అత్యంత విశాల దృష్టితో ప్రబోధించ గలిగింది. యావత్ ప్రపంచానికి అన్ని కాలాలలో మార్గదర్శకమైన ఏకైక ఆధ్యాత్మిక ఆశాజ్యోతిగా జగద్గురు పీఠాన్ని అధిష్ఠించ గలిగింది.

హిందూమార్గం ప్రతిపాదించిన సత్యమార్గాన విశ్వాసంతో, భక్తి ప్రపత్తులతో పయనించినంత కాలమూ భారతదేశం యెనలేని శాంతి సౌభాగ్యాలతో, అసమాన వైభవంతో విరాజిల్లింది. ఆ దారి తప్పినప్పటి నుండే తిప్పలు మొదలైనాయి. అలాంటి హీనదశ ఎదురైనప్పుడల్లా దయామయుడైన పరమాత్మ ఒక మహాత్ముడుగా లేదా మహా భక్తుడుగా, లేదా మహా జ్ఞానిగా అవతరించి ధర్మాన్ని పునః ప్రతిష్ఠిస్తూ ఉన్నాడు.

ఈ కలియుగంలో శంకర భగవత్పాదులవారు, రామానుజా చార్యులు, మధ్వాచార్యులు, గురునానక్, కబీర్, సమర్థ రామదాసు, రామకృష్ణ పరమహంస, వివేకానంద, స్వామి రామతీర్థ, రమణ మహర్షివంటి

మహాత్ములెందరో అలా అవతరించినవారే.

భగవద్గీతలో ఎన్ని అక్షరాలున్నాయో అంతమంది మహాత్ములు మన దేశంలో ప్రభవించారని ఒక పరిశీలకుడు అన్నమాట పరమ సత్యం. వెలలేని జాతి రత్నాలవంటి మహాత్ములు, పూర్ణ పురుషులు ఎందరో యీనాటికీ ఉద్భవిస్తూనే ఉన్నందువల్లనే మన దేశం తర్న గర్భగా ప్రఖ్యాతి గాంచింది.

అటువంటి జాతి రత్నాలుగా మన బాలబాలికలను తీర్చి దిద్దవలసినవి పాఠశాలలు. మనదేశంలో పూర్వం వాటని **గురుకులాలు** అనేవారు. మహోన్నతమైన సత్సాంప్రదాయాలు ఆ గురుకులాలలో నెలకొని ఉండేవి. గురువును దైవ సమానంగా శిష్యులు సేవించుకునేవారు. శిష్యులను కన్నబిడ్డలకన్న అధికమైన ప్రేమతో, వాత్సల్యంతో గురువులు ఆదరించేవారు. పన్నెండేళ్ళు, పదిహేనేళ్ళు...... యీ విధంగా ఏళ్ళ తరబడి ఎందరు శిష్యులున్నా అందరినీ అన్నవస్త్రాదులతో పోషించి విద్యగరిపేవారు.

వీరందరూ సర్వవిద్యాపారంగతులూ, సకల సద్గుణ సంపన్నులూ, సర్వ సమర్థులుగా తీర్చి దిద్దబడిన మీదట వాళ్ళను ప్రపంచంలోకి వదిలిపెట్టే వారు. వాళ్ళు తమ వినయ సౌశీల్యాదులతో, అనన్య ప్రతిభతో తమకు, తమ వంశీయులుకు, తమ గురువులకు, గురుకులాలకు, దేశానికి అఖండ ఖ్యాతిని ఆర్జించి పెట్టేవారు.

అట్టి శిష్యులలో వారే.... శివాజీ, రాణా ప్రతాప్, ఝాన్సీ లక్ష్మీబాయి, మహాత్మాగాంధీలవలె దేశ భక్తులైతే కర్మయోగిగా, రాజుఋషిగా దేశానికి, జాతికి యెనలేని సేవచేసి, సమాజానికి సుస్థిర శాంతి సౌభాగ్యాలను ప్రసాదించేవారు.

తుకారామ్, మీరా, కబీర్, త్యాగయ్యలవలె భగవద్భక్తులైతే మానవ హృదయ క్షేత్రాలను పదును చేసి, భక్తి జ్ఞాన వైరాగ్య బీజాలను నాటేవారు.

శంకర భగవత్పాదులు, వివేకానంద, స్వామి రామతీర్థ, రమణ మహర్షి వంటి అనుభవజ్ఞులు అయితే మానవ హృదయ కంజాతములోని అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి విజ్ఞాన భాస్కర కిరణాలను వ్యాపింపజేసేవారు.

-సశేషం

శ్రీరస్తు                    శుభమస్తు                    అవిఘ్నమస్తు

# ఆహ్వానము

ఆస్తిక మహాశయులారా,

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీఖర నామ సంవత్సర మాఘ శుద్ధ తదియ అనగా 26-01-2012 గురువారం నుండి రథసప్తమి అనగా 30-01-2012 సోమవారం వరకు గుంటూరు, సంపత్‌నగర్‌లోని శ్రీరామనామ క్షేత్రంలో

శ్రీకాళీ వనాశ్రమ వ్యవస్థాపకులు, అద్వైత సామ్రాజ్య చక్రవర్తి, సర్వాధిష్ఠాన
చైతన్య సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ
మహరాజ్‌వారి పరమానుగ్రహంతో,
ఆశ్రమ పీఠాధిపతి పూజ్యయోగిని శ్రీచంద్ర కాళీప్రసాద మాతాజీవారి
ఆశీర్వాద అనుగ్రహ పర్యవేక్షణలో

## పంచాహ్నిక శ్రీసద్గురు మహాసౌరయాగము

పంచాహ్నిక అఖండ నామ సంకీర్తన, త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళనము. సామూహిక కుంకుమ పూజలు, సామూహిక సూర్యనమస్కారములు, పూజలు నిర్వహించుటకు దైవజ్ఞులచే నిర్ణయించబడినది.

శ్రీసద్గురుదేవులు మిక్కిలిగా సంచరించిన, వారి అనంత భక్త సముదాయముతో కూడిన పవిత్ర క్షేత్రమైన గుంటూరులో, లోక కళ్యాణార్థం, సకల జీవకోటికి ఆరోగ్య, ఐశ్వర్య, జ్ఞానప్రదాత అయినటువంటి సూర్య భగవానుని యాగము చేయబూనుట మన మహత్తర భాగ్యము, అదృష్టఫలము.

మహాత్ముల దర్శనము వలన పుణ్యం లభిస్తుంది. వారి స్పర్శ వలన జన్మ జన్మల పాపములు నశిస్తాయి. వారి సంభాషణ వలన కోటి తీర్థములలో స్నానమాచరించిన ఫలితం లభిస్తుంది. వారికి చేయు వందనము వలన మోక్షము కలుగును. కావున భక్త మహాశయులందరూ యీ మహత్తర సదవకాశాన్ని సద్వినియోగ పరచుకుని యాగములో పాల్గొని, మహాత్ముల అమృత బోధలను విని, దైవ నామమును విని, అని, అమృత సమానమైన యజ్ఞ ప్రసాదమును స్వీకరించి, తరింతురు గాక. ఇదే అందరికీ హృదయపూర్వకమైన ఆహ్వానము!

గమనిక -

27-1-2012 శుక్రవారం రాత్రి 10.17 ని॥ వివాహ ముహూర్తము.
28-1-2012 శనివారం ఉ॥ 9.42 ని॥ ఉపనయన ముహూర్తము.
29-1-2012 ఆదివారం రాత్రి 10.07 ని॥ వివాహ ముహూర్తము.

వివరములకు -

డా॥సి.కృష్ణార్జునరావు 98491 85087        యమ్. జగన్నాథరాజు 98858 31651
యమ్. పాండురంగనాథ్ 93976 05171        యమ్. విఠల్‌రావు 94411 27077

- శ్రీ బాబూ భక్తసమాజ్, గుంటూరు

**సాధు ధర్మ సమ్మేళనమునకు విచ్చేయు మహాత్ములు**

**పరమహంస పరివ్రాజకాచార్య పరమపూజ్యపాద శ్రీశ్రీశ్రీ 108 దండి నిర్మలానందగిరి స్వామీజీ (అష్ట లక్ష్మీ పీఠం, తెనాలి) వారి నిర్వహణలో త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళనము.**

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు (శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, శ్రీకాళహస్తి)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతి స్వాములవారు (కుర్తాళం పీఠాధిపతులు, కుర్తాళం)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్‌వారు (విశ్వమందిర అధిపతులు, గుంటూరు)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ డా॥ కరిబసవ రాజేంద్ర మహాస్వాములవారు (గవిమఠం మహాసంస్థానం - ఉత్తరాధికారి - ఉరవకొండ)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ బ్రహ్మానంద తీర్థ స్వాములవారు (శ్రీసత్యానందాశ్రమ వరిష్ఠ పీఠాధిపతులు,ఇనమడుగు)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ స్వస్వరూపానందగిరి స్వాములవారు (శ్రీవశిష్ఠాశ్రమాధిపతులు, తిరుపతి)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానంద సరస్వతి స్వాములవారు (శ్రీ పీఠం అధిపతులు, కాకినాడ)

ప॥ప॥ప॥ శ్రీశ్రీ శ్రీ వాసుదేవానంద స్వాములవారు (శ్రీవిద్యాపీఠాధిపతులు, పెదపులిపాక)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ అభేదానంద స్వాములవారు (శ్రీరామానంద యోగాశ్రమము, జి.ఆర్. పురము)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ హరితీర్థ స్వాములవారు (శ్రీసత్యానందాశ్రమ పీఠాధిపతులు, ఇనమడుగు)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ శంకరానంద స్వాములవారు (శ్రీదత్తాత్రేయ ఆశ్రమము, మంకాల)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ నిత్యానంద భారతీ స్వాములవారు (శ్రీగురుమందిరము, బళ్ళారి)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ డా॥ వాసుదేవానంద సరస్వతి స్వాములవారు (శ్రీరాజవిద్యాశ్రమ పీఠాధిపతులు, రాయదుర్గం)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ కృష్ణానందగిరి స్వాములవారు (శ్రీకృష్ణ గీతాశ్రమము, జి. మేడపాడు)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ మాతా త్యాగీశానందపురిజీవారు (శ్రీరామకృష్ణ భక్తసమాజం, బాపట్ల)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ మాతా జ్యోతిర్మయానంద భారతివారు (శ్రీపరబ్రహ్మ షణ్ముఖ ఆశ్రమము, పాలకొల్లు)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ నిర్వికల్పానందగిరి స్వాములవారు (శ్రీ శేషాచల ఆశ్రమాధిపతులు, గుంటూరు)

ప॥ప॥ప॥ శ్రీశ్రీశ్రీ స్కందదేవానందగిరి స్వాములవారు (శ్రీకృష్ణనారాయణ ఆశ్రమాధిపతులు, తుళ్ళూరు.)

**కార్యక్రమముల వివరములు**

26-01-2012 నుండి 30-01-2012 వరకు శ్రీసద్గురు మహాసౌర యాగము

27-01-2012 నుండి 29-01-2012 వరకు ప్రతిరోజూ ఉదయం 10గంటల నుండి 12గంటల వరకు, సాయంత్రం 5గంటల నుండి 8గం.ల వరకు సాధుధర్మ సమ్మేళనము.

30-01-2012 యాగ పూర్ణాహుతి. ఉదయం 10గం.లకు శ్రీసద్గురుపాదపూజ, నామకరణములు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసములు. తదుపరి మహాప్రసాద వితరణ.

**విశేష కార్యక్రమములు**

27-01-2012 శుక్రవారం ఉదయం 7గం.లకు సామూహిక కుంకుమ పూజలు

29-01-2012 ఆదివారం ఉదయం 7గం.లకు సామూహిక సూర్యభగవానుని పూజలు.

30-01-2012 సోమవారం ఉదయం 10గం.లకు శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదము.

26-01-2012 నుండి 29-01-2012 వరకు మధ్యాహ్నం, సాయంకాలం మహాప్రసాద వితరణ జరుగును. పూజలలో, యాగములో పాల్గొన దలచినవారు తగినంత ముందుగా నిర్వాహకులను సంప్రదించగలరు.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీబాబు తమ పర్యటనలలో ఎన్నెన్నో వనమూలికలను, ఔషధములకు పనికివచ్చే వేళ్ళను, దుంపలను, చెట్ల బెరళ్ళను సేకరించి, పుటాలు పెట్టించి, సన్నెకల్లుతో నూరించి ఔషధములను తయారుచేసేవారు. శ్రీపరశురామయ్యా గారికి కూడా ఈ విషయంలో బాగా ఆసక్తి, శ్రద్ధ, నైపుణ్యం ఉండేవి. వారివురు తత్త్వవిచారణ చేసుకుంటూ తయారు చేసిన ఔషధాలు, ఎంత ప్రసిద్ధులైన వైద్యులకైనా అంతు చిక్కని మొండి రోగాలను, మానసిక, గ్రహ వ్యాధులను కూడ నిర్మూలించ గలిగినవి. గంగరాజుపాక ప్రక్కనే ఉన్న మరొక పాకలో ఉండే పేద బ్రాహ్మణుడు గున్నప్పగారి భార్యకు మోకాలిపై వచ్చిన రాచపుండును (కాన్సర్) స్పెషలిస్ట్‌లు కూడా కుదర్చ లేకపోతే, శ్రీబాబు ఇచ్చిన మందుతో నయమైంది.



శ్రీబాబు యనమదుర్రులో ఉన్నప్పుడు, భీమవరం, దిరుసుమర్రు, గొల్లపాలెం మొదలైన చుట్టుప్రక్కల గ్రామాలనుంచి శ్రీబాబూజీ దర్శనం కోసం ఎందరో జనం వచ్చేవారు. వారిలో శ్రీబాబు యెడల భక్తి గౌరవాలు కలిగినవారూ ఉండేవారు; నిరసన భావం కలిగిన వారూ ఉండేవారు. అప్పటిలో కొన్నేళ్ళు వరుసగా శ్రీదేవీశరన్నవరాత్రి పూజలు యనమదుర్రులో జరిపేవారు. శ్రీపరశురామయ్యగారింట్లోనే పూజలు జరిగేవి.

ఒకసారి దసరాపూజలలో ఒక విచిత్ర సంఘటన జరిగింది. భీమవరంలో నాచు వెంకటరత్నంగారని సుప్రసిద్ధులైన ప్లీడరుగారు ఉండేవారు. వేషభాషలలో మంచి దర్జాగా ఉండేవారు. చేతిలో ఎప్పుడూ ఒక తుపాకీ ఉండేది. ఆయనకు శ్రీబాబుమీద ఏమీ నమ్మకం లేదు. కాని చాలామంది మాటిమాటికి శ్రీబాబు మహాత్ములని, దసరాపూజలకు యనమదుర్రు వచ్చి వారి దర్శనం చేసుకోండని ప్రోద్బలం చేశారు. "ఇలాంటి మహాత్ములను, బాబాలను, చాలామందిని చూశాములే. సరే ఈయన సంగతి కూడా చూద్దాము" అనుకొని బుట్టలలో బత్తాయిలు, అరటిపళ్ళు, చేతిలో తుపాకీతో సహా ప్లీడరుగారు యనమదుర్రు వచ్చారు. చాలాసేపటి వరకు బాబు దర్శనం కాలేదు. దసరాలలో పూజకు చాలా ఎక్కువ సమయం పడుతుంది గదా! ఈలోపల శ్రీపరశురామయ్యగారితో

ప్లీడరుగారు ఇంగ్లీషులో భగవద్గీతను గురించి, భగవంతుడిని గురించి మాట్లాడారు.

పూజ ముగిశాక, శ్రీబాబు బయటకు వచ్చారు. అందరికీ తీర్థం ఇచ్చారు. ప్లీడరుగారు కూడా తీసుకున్నారు. శ్రీబాబు వారికి పళ్ళు ప్రసాదంగా ఇచ్చి "ఇది జగజ్జనని ప్రసాదం బాబూ! తీసుకోండి. తమరు ఎందరెందరో మహాత్ములను దర్శించిన పరమ భక్తులు. నామీద ఎంతో అనుగ్రహంతో, ప్రేమతో "ఈ 'బాబా' సంగతి కూడా చూద్దాం'' అని వచ్చారు. ఇది బాబూ! యీ బాబా సంగతి. సర్వజీవకోటికి తల్లియైన జగన్మాత దివ్య చరణారవిందాలను ఆశ్రయించుకొని ఇలా కాలక్షేపం చేస్తున్న వాణ్ణి. చూశారు గదా! థాంక్యూ! (అని ఇంగ్లీషులోనే శ్రీబాబు అన్నారు). అమ్మకు నివేదన చేసిన మహాప్రసాదమును (భోజనం) స్వీకరించి మరీ వెళ్ళండి. ఇంకొక్క రోజు ఉండగలిగితే సంతోషమే. ఆహా! అన్నట్లు మరచిపోయాను. ఎన్నెన్నో గడ్డుకేసుల పరిష్కారం కోసం తమకై ఎందరెందరో వేచి ఉంటారేమో! వెళ్ళిరండి, వెళ్ళిరండి. జగన్మాత మీరు చేపట్టిన అన్ని కేసులలోనూ ధర్మపరంగా వాదించే శక్తిని మీకు ప్రసాదించుగాక! పరమాత్ముని అనుగ్రహం సర్వదా మీపై వర్షించుగాక!'' అని మందహాసంతో ఆశీర్వదించారు.

పూజ గది నుండి శ్రీబాబు బయటకు వచ్చినప్పుడు లభించిన శ్రీబాబు ప్రథమ దర్శనంలోనే, మంత్రముగ్ధుడైన వాని వలె చేతులు జోడించిన ప్లీడరుగారు రెప్పవాల్చక శ్రీబాబు వంకనే చూస్తూ, చేష్టలుడిగిన శిలా ప్రతిమ వలెనే, అలాగే నిలబడిపోయారు. అక్కడి నుండి ఎవరో చేయూతనందించి ఆయనను తీసుకొని వెళ్ళవలసి వచ్చింది.

తరువాత ఆయన ఆలాగే వారంరోజులు అక్కడే ఉండిపోయారు. "బాబూ! బాబూ!'' అనడం తప్ప మరొక మాట లేదు. శ్రీబాబు కనబడినప్పుడల్లా "బాబూ! నా మనస్సును మీరు తీసేసుకున్నారు. తిరిగి నాకు ఇచ్చేయండి బాబూ!'' అనేవారు. కేసులను గురించి, పార్టీలెందరో ఆయనతో మాట్లాడి తీసుకు వెళ్దామని వచ్చారు. అందరితోనూ అదేమాట. "బాబుగారు నా మనస్సును తీసేసుకున్నారు. నేనేం చేయను? అది నాకిప్పించండి. నేను వచ్చేస్తాను''. అందరూ బాబుతో మొరపెట్టుకున్నారు. శ్రీబాబు మందహాసంతో "ఆయన నన్ను చూడగానే నా మీద ఆయన మనస్సు పారవేసుకున్నాడు. మరి నేనేం చేయను? కావాలంటున్నాడు గదా! తీసుకు వెళ్ళమనండి'' అని ఆయన్ను పిలిపించి తీర్థ ప్రసాదాలిచ్చారు. ఆయన సాష్టాంగ నమస్కారం చేసి చెమ్మ గిల్లిన కన్నులతో బాబును చూస్తూ వెళ్ళిపోయారు.

-సశేషం

# అమావాస్య నాడు పూర్ణిమ

- ఆంగ్ల రచన ఆర్. సంపత్ - తెలుగు అనువాదం సుషుమ్న ప్రసాద

పశ్చిమాద్రిన సూర్యాస్తమయ సమయము సమీపిస్తుంటే, గ్రామస్థులంతా పూజారికి జరగబోయే విపత్తుకు చింతాగ్రస్తులైనారు. రాజుగారు తన గదిలో తూర్పు అభిముఖంగా కూర్చుని, పూజారి చెప్పినట్లు నిజంగా పూర్ణచంద్రోదయం జరగటం సంభవమేనా! అని ఆలోచిస్తున్నారు.

అకస్మాత్తుగా సూర్యుడదృశ్యమై ఆకాశమున అద్భుతాల్లో అద్భుతముగా గోచరించింది. ప్రతి ఒక్కరూ ఉత్సుకతతో యెదురు చూస్తుండగా, గగనాన తూర్పు దిశన మహత్తర ప్రకాశంతో పూర్ణ చంద్రోదయమైనది!

కోటి చంద్రుల ప్రకాశమునకు మించిన చల్లని వెలుగు జిలుగులతో గగనమంతా మిలమిలా మెరుస్తున్నది. ఆ అద్భుత దృశ్యాన్ని తిలకించిన వారంతా నిర్విణ్ణులై, యిదెలా సాధ్యమని ఆశ్చర్యపోయారు.

రాజుగారు దేవాలయమునకు పరుగు పరుగున వచ్చి, పూజారికి సాష్టాంగ నమస్కారం చేశాడు. పూజారి మహిమను గ్రహించకుండా అతని జీవితంతో ఆడుకోదలచిన తన మూర్ఖత్వమును క్షమించమని, అశ్రుపూరిత నయనాలతో అర్థించాడు. ఇలాంటి అనూహ్యమైన వింత పరిణామమెలా జరిగిందో వివరించమన్నాడు.

పూజారి రాజుగారిని సున్నితంగా లేవనెత్తి యిలా చెప్పారు " నాకు ప్రతిరోజూ పూర్ణిమయే. ఎందుకంటే మహత్తర దివ్యతేజస్సుతో విరాజిల్లే జగజ్జనని ముఖారవిందమును సర్వే సర్వత్రా దర్శిస్తుంటాను. అందువల్ల తప్పకుండా పూర్ణ చంద్రోదయమవుతుందనే నమ్మకంతో ఉన్నాను". జరిగిన సంఘటనతో గ్రామస్థులంతా మహదానందపడ్డారు.

ఈ సందర్భంలో యిదెలా సంభవమని పాఠకులకు సందేహం కలగవచ్చు. ఆ పల్లెలో సంధ్యా సమయం సమీపిస్తుంటే, కైలాసమున పరమశివుడు తన దేవేరి పార్వతీదేవిని అసాధ్యమైన సంఘటన జరుగుతుందని వాగ్దానము చేసిన తన భక్తుని యెలా రక్షిస్తావని ప్రశ్నించాడు.

జగజ్జనని చిరునవ్వుతో యిలా సమాధానమిచ్చింది "వేచి ఉండండి. చూడండి ప్రభూ! నా ప్రియభక్తుని నేను వంచనకు గురిచేయగలనా?" అలా

అంటూ జగన్మాత తన వెండి కడియాన్ని గగనాన తూర్పు దిశగా విసిరివేసింది. వెంటనే ఆ కడియము సర్వులకూ పూర్ణచంద్రుడనే భ్రమను కలిగించింది.

జగజ్జనని, బాహ్యంగా అవాస్తవంగా కనిపించే తన ప్రియభక్తుడైన అభిరామభట్టు మాటను సత్యమని నిరూపించి, అతనిని రక్షించింది.

## లోపలి చేదు

ధర్మరాజు ఒకప్పుడు తీర్థయాత్రలకు వెళ్తూ, శ్రీకృష్ణుణ్ణి రమ్మనమన్నాడు. ఆయన తనకు బదులుగా ఒక సొరకాయ యిచ్చి, అన్ని తీర్థాలలోనూ ముంచి తీసుకురమ్మన్నాడు. ధర్మరాజు అలాగే ముంచి తెచ్చాడు.

శ్రీకృష్ణుడు ఆ సొరకాయను పగులగొట్టించి, కూర వండించి సమారాధనలో వడ్డించాడు. అది కటిక చేదు. తిన్నవాళ్ళు వాంతులు చేసుకో సాగారు.

"అయ్యో! యిన్ని తీర్థాలలో మునిగినా, లోపలి చేదు చావలేదే! ఉత్త దండుగ. లోపల కల్మషం పెట్టుకుని ఎన్ని గంగలలో మునిగితే లాభమేమిటి?" అన్నాడు శ్రీకృష్ణుడు. విషయం అర్థం చేసుకున్న ధర్మరాజాదులు తల వంచుకున్నారు.

**"ఆత్మనదీ సంయమ తోయపూర్ణా**
**సత్యావహా శీలతటా దయోర్మి:**
**తత్రాభిషేకం కురు ధర్మపుత్ర!**
**న వారి ణా శుధ్యతి చాంతరాత్మా!**

(పాండవ గీత)

ఆత్మజ్ఞానమనే నదిలో సంయమమే - జలం; సత్యమే - ప్రవాహం; శీలమే - గట్టు; దయయే - తరంగాలు

ధర్మరాజా! అటువంటి ఆత్మ జ్ఞానమనే నదిలో స్నానం చెయ్యి. మామూలు నీళ్ళతో జీవుడు శుద్ధి పొందడు సుమా!" అని బోధించాడు శ్రీకృష్ణుడు.

## బెంగుళూరులో శ్రీ మాతాజీ సత్సంగం

-రమణ ప్రసాద్

### ప్రబోధం

బ్రాహ్మీ ముహూర్తంలో శ్రీమాతాజీ చేసిన బోధ....

" ఇప్పుడు ఎంతో ప్రశాంతంగా ఉంది. ఏ చిన్న శబ్దం వచ్చినా ప్రశాంతతను భంగ పరుస్తుంది. ప్రొద్దుట లేచిన దగ్గర నుంచి పడుకునే వరకు ఎన్నో కార్యాలు చేస్తాము. ఇంకా ఎన్నో పనులు ముగించుకుని పడుకుంటాము. కాని తెల్లవారుజామున లేవాలంటే లేవలేము. ప్రశాంతత కావాలంటే ధ్యానం చేయాలి. ధ్యానం కుదరాలంటే మనస్సు నిర్మలంగా ఉండాలి.

మనం నిత్యానంద స్వరూపులము. సుఖ దుఃఖాలు తాత్కాలికం. బ్రాహ్మీముహూర్తం అనుష్టానానికి తగిన సమయం. స్వతహా మనస్సుకు ఏ వాసనా లేదు. దారాన్ని ఏ రంగులో వేస్తే ఆ రంగు వచ్చినట్లుగా మనస్సును దేనిలో ఊరవేస్తే ఆ రంగు పొందుతుంది. స్థిరంగా ఉండాలంటే ఉండలేదు. ఏమీ చేయకుండా ఉండలేము. చుట్టూ ఏ అలజడులూ లేకపోయినా, మనస్సులో అలజడులను కట్టిపెట్టలేము. అలసట, ఆలసత్వంలో కూరుకునిపోయినప్పుడు దానినుండి బయటపడాలంటే యాక్టివ్‌గా (ఉత్సాహంగా) ధ్యానం చేయాలి. ఈ జీవితమనే ఇల్లు ఒక అద్దె కొంప. దానిని 'సుఖప్రారబ్ధ గ్రహచారబండి' అనేవారు శ్రీగురుదేవులు.

మనస్సులో ఏదీ లేకపోతే నిద్ర పడుతుంది. అది గాఢ నిద్ర. నిద్ర నుంచి లేచి 'హాయిగా ఉంది' అంటాము. ఆ స్థితిని జాగ్రతావస్థలో కూడ పొందాలి. జాగ్రదావస్థలో సుఖం ఉన్నది అన్న విషయాన్ని మనస్సుకు అందించాలి. మనస్సును భగవద్విషయంలో ఊరవేయాలి. మనస్సును బుద్ధిలో లయింపజేయటమే ధ్యానం. అలాగే మనస్సును ధ్యాన ప్రక్రియలోకి చేరిస్తే అది ధ్యానం అవుతుంది. ధ్యానం వల్ల వచ్చే శక్తిని కరెంట్ తో పోల్చవచ్చు.లైట్లు, ఫ్యానులు పని చేయటానికి కరెంట్ ఆధారం. మనలో ఉన్న శక్తిని చైతన్యం అనికూడా అంటారు. అదే మన మనుగడకు ఆధారం. పూజ యిత్యాదులు రెండవ స్థానలోకి చేరుతాయి.

ధ్యానం మన నిజస్థితి. ఆ స్థితిలో ఉండేవారే మహాత్ములు. ఈ ధ్యాన

సమయంలో మన యిల్లు మనం చక్కబెట్టుకోవాలి. భగవద్విషయంపై మనస్సును నిలిపిన సాధకుడు ఏ పనిచేసినా ధ్యాన స్థితిలోనే ఉంటాడు.

మనస్సును 'నేను'గా మాట్లాడతాము. 'నా మనస్సేమీ బాగోలేదు' అంటాం. అంటే మనస్సు నాది. అసలు 'నేను' దేనికీ చెందదు. అంతటా ప్రకాశిస్తుంది. ఉదాహరణకు సినిమారీలు, తెర వెనుక ఉంటుంది. సినిమాలో వాళ్ళు ఏడిస్తే మనం ఏడుస్తున్నాము. వాళ్ళు నవ్వితే మనం నవ్వుతున్నాము. ఇది తెచ్చి పెట్టుకున్నదే కదా! పాత్రను ఖాళీగా ఉంచుకోవాలి. సంస్కారాలతో వాసనలతో నిండిన మనస్సుకు ఏదీ పట్టదు. బిందె నిండా నీరు ఉంటే పంపు నుంచి వచ్చే నీరు పై నుంచే వెళ్ళిపోతుంది.

తెల్లవారుజామున అనుష్ఠానం బాగా కుదరాలి అంటే రాత్రి మితాహారం చేయాలి. మానవజన్మ రావటం, మహాత్ములని ఆశ్రయించటం ఎంత ముఖ్యమో, అలాగే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచటం అంతే ముఖ్యం.

మనస్సును ఏకాగ్రత చేయాలంటే మనస్సును ఖాళీగా ఉంచుకోవాలి. మన జ్ఞానేంద్రియాలు - కన్ను, ముక్కు, చెవి, నోరు, త్వక్కు. ప్రపంచపరంగా ఉన్న ఇంద్రియాలను భగవత్పరంగా మలచుకోవాలి.

మనం ఆశ్రయించిన పాదం ఎంత గొప్పది! మనందరికోసం 'బాబు'గా అవతరించారు. 'మీ హృదయ బాబు'ని అని ముద్ర వేశారు. హృదయంలో పూజించుకోవాలి అంటే బయటవి ఏవీ పనికిరావు. మనస్సులో దర్శిస్తూ పూజ చేయాలి. ట్రైన్‌లో వెళ్తూ కూడా యీ పూజ చేయవచ్చు. ఇదే మానసిక పూజ.

కలశ పూజ చేస్తాం. అన్ని నదులూ అందులో ఉన్నట్లుగా భావించి వేదాలను, నాలుగు ద్వారాలుగాభావిస్తాం. చెయ్యి కలశం మీద పెట్టి దానిని పవిత్ర జలాలుగా భావిస్తాం. అలాగే స్వామి హస్తం మన తల మీద పెట్టి మనని పవిత్ర కలశంగా చేసారు. వారి చల్లని నీడలో మనకు ఆశ్రయం యిచ్చారు. ఎట్టి గాలికీ ఎగిరిపోని గట్టి గుంజలుగా మార్చారు.

మనది మార్జాల కిశోర న్యాయం కాని మర్కట కిశోర న్యాయం కాదు. అంతటి అపురూపమైన ఆదరణ యిచ్చారు శ్రీగురుదేవులు. మన చెయ్యే వారి చేతిలో ఉంది. మన చిత్తం వారి అధీనంలో ఉంది. అది యిది అననేల? చేతనమే వారిదై ఉన్నది. చేతనం అంటే ప్రకాశం. అంతటా ప్రకాశించేది. ఆకాశం అనంతం. కాని కుండలలో నిల్చిన ఆకాశాన్ని ఘటాకాశం అంటున్నాము. ఘటం విచ్ఛిన్నం అయితే మిగిలేది మహాకాశమే. కుండ విచ్ఛిన్నం

అయితే ఏడవ వలసిన అవసరం ఎక్కడిది?**నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః** అని భగవంతుడు చెబుతున్నాడు. ఆత్మను ఖండించలేము. కాల్చలేము, గాలితో ఎగురగొట్టలేము.

హృదయబాబుని మనస్సు ద్వారా గుర్తించాలి. జీవితంలో కష్టసుఖాలు రావటం సహజం. దానికి సమాధానం అవగాహన. జీవితానికి ఆధారమూ, ఆధేయమూభగవంతుడే!తాబేలు ఎలా యింద్రియాలను ముడుచుకుంటుందో అలాగ మనస్సును కామక్రోధాలపై పరుగెట్టకుండా వాటిని శమదమాది షట్క సంపత్తిగా మార్చుకోవాలి. గురుపాదాశ్రయం వల్లనే అది సాధ్యమూ,సులబమూ.

దేవుడు ఎక్కడ ఉన్నాడు? అంటే దేవుడు లేనిదెక్కడ? విచారణ చేత గుర్తించాలి. హృదయంలో ఏకాగ్రత చేస్తే ధ్యాన స్థితి లభిస్తుంది. తానెవరో తెలుసుకొని తాను తానై ప్రకాశిస్తాడు. అట్టి జ్ఞాని స్థితి చె.వీ&.కు పండిన మామిడి పండులాగా ఉంటుంది. దానంతట అదే రాలిపోతుంది. బలవంతంగా తీయకూడదు. కనురెప్పలు శ్వాస నిశ్వాసలు వాటంతట అవే పనిచేస్తాయి. భగవంతుడే మనల్ని యిలా నడిపిస్తున్నాడని గుర్తించి, విషయాలకు స్పందించకుండా విశ్వనాధుని మనస్సులో నిలుపుకోవాలి.

సద్గురుదేవులు అనుగ్రహంతో ప్రశాంతతకు అడ్డువచ్చే విషయాదులను తొలగించుకోవాలి. మనయింట్లో మనది కానిది ఉండబట్టే ఆనందాన్ని పొందలేకపోతున్నాము. 'దోమతెరలో ఒక్క దోమ చేరితేనే నిద్రపట్టదు కదా! మీకెలా నిద్ర పడుతోందర్రా!' అనేవారు శ్రీగురుదేవులు. శారీరకంగా మానసికంగా వ్యధను పొందుతున్నాం. యాంత్రికంగా జీవనాన్ని సాగిస్తున్నాం. కాని ఒక దివ్య శక్తి మనని నడుపుతోంది అని గుర్తించలేకపోవటమే దుఃఖానికి అశాంతికి కారణం.

కాలం వృథాగా అయిపోతోంది. ఎలా వచ్చామో అలాగే ఏదో ఒక రోజు పోవటం తథ్యం. ప్రశాంతత మన స్వభావం. ధ్యానం మన సహజస్థితి. పాలను పొంగిస్తున్నప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉంటున్నాం. భోజనం ఎంతో నిశితంగా చేసుకుంటున్నాం. కాని మనలో ఉన్న దివ్యశక్తిని గుర్తించలేక పోతున్నాం. **'ధీయో యోనః ప్రచోదయాత్'** మన మనస్సును ఏ శక్తి ప్రబోధిస్తోంది?

మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను మన యింటికి మనం వెళ్ళటమే ధ్యానం. వేదాలు ఎవరిని కీర్తిస్తున్నాయి? సత్యం, జ్ఞానం మన సహజ స్థితి అని

తెలుసుకుని అడ్డువచ్చే వాటిని తొలగించుకుందాం. ఓంకారాన్ని నాదపూర్వకంగా చేయాలి. నిశ్శబ్దంలో వినిపించే నాదం ప్రణవమే!

పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రిలిజియన్స్‌లో ప్రణవం ఎందుకు అనాలి? అని అడిగారు. దానికి సమాధానం గురుదేవులే స్ఫురింప జేశారు. చిన్న పిల్లవాడని పడుకో బెట్టటానికి తల్లి కూనిరాగాలు తీస్తుంది. వాడు కూడా ఆ రాగంలో స్వరం కలుపుతూ నిద్రలోకి జారుకుంటారీడు. అప్పుడు రాగం ఆగిపోతుంది.శబ్దాతీత స్థితిని అనుభవించటానికి ప్రణవాన్ని, అంటే ఓంకారాన్ని చేస్తాం.

ధ్యానానికి ముందుగా నిటారుగా కూర్చోవాలి. ఆసన శుద్ధి అవసరం. ఏ కోరికలూ మనస్సులోకి రాకూడదు. లక్ష్యార్థాన్ని ధ్యానించండి. గురుపాదం, గురునామం, గురుతత్త్వం ధ్యానించండి. భ్రూమధ్యంపైనగాని, నాసికాగ్రంపైన గాని, హృదయంపైనగాని, దృష్టి నిలిపి ధ్యానించండి. సద్గురుదేవులు అట్టి నిశ్చల స్థితిని, ప్రశాంతతను, ఆత్మానంద స్థితిని మనకు ప్రసాదించెదరు గాక! సుఖీభవ! సుఖీభవ!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ పరమ భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన దాసరి నాగరత్నమ్మగారు (కీ॥శే దాసరి వీర్రాజుగారి భార్య) 30-11-2011 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 85 సంవత్సరములు. వీరికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె, మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు కలరు. పరమేశ్వరుడు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించుగాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రద్ధ

-బి. భారతీదేవి

ఒకయువకుడు చెరువు నుంచి కావిడిలో బిందెలతో నీళ్ళు మోసుకొచ్చి ఊళ్ళోవాళ్ళకి పోస్తూ ధనం సంపాదించి జీవిస్తూ ఉండేవాడు. ఒకనాడు ఆ ఊళ్ళో ఉన్న పురాతనమైన శివాలయంలో గోడమీద "ఈ ఆలయంలోని పరమేశ్వరునికి వందబిందెల నీళ్ళు అభిషేకం చేసిన వారికి స్వామి ప్రత్యక్షమై కోరికలు తీరుస్తాడు" అనే వ్రాత చూశాడు. వాడికి తాను రోజూ వందల బిందెలపైనే నీళ్ళు మోస్తున్న సంగతి గమనించి, ఒకసారి స్వామికి వందబిందెల నీళ్ళు పోసి, తన కోరికలు తీర్చుకోవచ్చుననే ఆలోచన కలిగింది. వెంటనే వాడు ఆ పని ప్రారంభించాడు.

వానిలో దైవం ప్రత్యక్షమైతే అడగవలసిన కోరికల జాబితా చురుకును పుట్టించగా, చకచకా నీళ్ళు తెచ్చి పోయసాగాడు. 40, 50 బిందెల వరకు శ్రద్ధగా పోశాడు. ఆపైన 60, 70 బిందెల వరకూ ఎలాగో పని పూర్తి చేయాలనుకుంటూ చేశాడు. 80 బిందెలు దాటి, 90 బిందెల వరకూ వచ్చేసరికి ఎందుకీ పని మొదలు పెట్టానా అనే విసుగుతోచి, అసలు యీ దేవుడు ప్రత్యక్షమై వరాలిస్తాడా? అనే అపనమ్మకం వానిలో చోటు చేసుకుంది. ఇంతవరకూ స్వామిలో ఏ కదలికలూ లేకపోవటంతో వాని అనుమానం పెనుభూతమై, వాని బుద్ధింతా ఆక్రమించింది. నూరో బిందె విసురుగా మహాదేవునిపైన జారవిడిచేసరికి, అది లింగానికి తగిలింది.

ఆ క్షణాన పెద్ద మెరుపు మెరిసింది. "ఏమిరా? నీ అజ్ఞానం? నీ మూర్ఖత్వానికి ఫలితం నీ ప్రయత్నం నిష్ఫలం కావటమే. ఇంతవరకూ నువ్వు పడిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైంది." అనే వాక్యాలు ఆకాశంలో మారుమ్రోగాయి.

శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో - శ్రద్ధావంతులై నా యందు అనురక్తులైన భక్తులు నాకు ప్రియులు" అన్నాడు.

శ్రీబాబు - మానవుడు ఏది సాధించాలన్నా 'శ్రద్ధ' ఆవశ్యకం. శ్రద్ధ ఉన్నప్పుడే విశ్వాసం బలపడుతుంది. భక్తి కలుగుతుంది. త్యాగం చేయ గలుగుతారు. కార్యాన్ని సాధించగలుగుతారు అని అన్నారు.

# విష్ణుకథలు

-రమణ ప్రసాద్

శ్రీకాళీపరదేవతా చరణ రాజీవ ద్వయీ దివ్య సే
వా కౌతూహల ధన్యజీవన జగత్ ప్రఖ్యాత భక్తావన
శ్రీ కళ్యాణగుణానిలయా!సగుణమూర్తీ!సద్గురూ! సర్వ
లోకైకత్రాణ ధురీణ! పుణ్యానిలయా! కాళీ ప్రసాద ప్రభూ!

శ్రీగురుదేవుల చరణ కమలములకు ప్రణామములు అర్పిస్తూ విష్ణుకథలను సరళమైన భాషలోవ్రాసే ప్రయత్నం చేస్తున్నాను.-ఈ కథలు పాఠకులను అలరిస్తాయని ఆశిస్తున్నాను

భగవంతునికొరకు పరితపించే భక్తి ఉత్తమము. అట్టి భక్తిని హృదయంలో నిలిపే సంతు మహాత్ముల సాంగత్యము దుర్లభం. భగవంతుని కొరకు పరితపించే అంతఃకరణ, భక్తి వల్ల కలుగుతుంది. "'భగవాన్! నీ కొరకు నా దేహం రాలిపోనీ'' అన్నాడు సమర్థ రామదాసు భగవద్వియోగాన్ని భరించలేక. భక్తులు జాతి, వర్ణ, మతాలకు అతీతులు. భక్తులు సకల వర్ణాలలో జన్మించారు. సర్వ మానవ సమానత్వాన్ని చాటారు.



పాండురంగ కాంతి
దివ్యతేజ ఝళకత్

## పుండరీకుని చరిత్ర

కలియుగంలో మానవులను తరింప చేయటానికి వెలసిన పుణ్యక్షేత్రం పండరీపురం. పరమ పావన చంద్రభాగానదీ పుణ్యతీర్థంలో ఎందరో మహాభక్తులు ఉద్భవించి ప్రజలకు భక్తి మార్గాన్ని బోధించారు. పవిత్రమైన పందరీపురంలో వెలసి ఉన్న శ్రీ పాండురంగని అవతారవైభవాన్ని గురించి అనేక విధాలుగా చెపుతుంటారు. శ్రీకృష్ణపరమాత్మ రుక్మిణీ దేవిని వివాహమాడిన తర్వాత జరిగిన సంఘటనే శ్రీ పాండురంగని అవతారానికి కారణం అని చెపుతారు.

ఒకనాటి రాత్రి శ్రీకృష్ణుడు బృందావనంలో గోపీమణులతో రాసక్రీడ జరుపుతుండగా, భర్తను వెతుకుతూ అక్కడికి వచ్చిన రుక్మిణి గోపికలతో

కూడిన తన భర్తపై కోపించి, వైరాగ్యంతో డిండీరవనానికి వెళ్ళి అక్కడ తపస్సు చేయసాగింది. రుక్మిణీదేవిని వెతుకుతూ అక్కడకు వచ్చి పుండరీకునికి దర్శనం ఇచ్చి కటిహస్తుడై నిలిచినఉన్న పతి వద్దకు రుక్మిణీదేవి వచ్చి భర్త ఎడమప్రక్క నిలిచింది. శ్రీకృష్ణుని కృపచేత సద్గతిని పొందిన దేవేంద్రుడు మయుని పిలిచి పండరిపురం, బిందు తీర్థం, దాని మధ్య పీఠం నిర్మించమని ఆదేశించగా, అతడు నిర్మించిన పీఠం పైన రుక్మిణీ మాధవులు వెలిశారు. అదే శ్రీవిఠ్ఠల నాథుడు, రఘుమాబాయి వెలసిన దివ్య మందిరం.

లోహదండపురంలో జరిగిన మరొక చరిత్ర శ్రీపాండురంగని ఆవిర్భావానికి కారణం అనికూడా చెపుతారు....

లోహదండనగరంలోరీ శ్రీమన్నారాయణమూర్తి భక్తులైన జహ్నువు, సాత్యకి దంపతులు ఉన్నారు. చాలాకాలం తర్వాత వారికి ఒక పుత్రుడు కలిగాడు. అతనికి పుండరీకుడు అని నామకరణం చేశారు. అతడు పెరిగి పెద్దవాడై దురలవాట్లకులోనైయ్యాడు. వేశ్యాలోలుడై దుష్టకార్యాలు చేస్తూ, తన తల్లి దండ్రులను హింసించేవాడు. అతనిని సన్మార్గంలో పెట్టటానికి చేసిన వారి ప్రయత్నాలు విఫలమై, పుత్రుడు చేసే క్రూరకృత్యాలను చూడలేక ఎక్కడికైనా పోయి మరణించాలని నిశ్చయించుకున్నారు. కాశీయాత్రకు పోవువారు అచ్చటికి రాగా వారితో కాశీకి ప్రయాణమైయ్యారు. మరికొన్ని రోజుల తరువాత పుండరీకుడు కూడా తన భార్యతో కాశీకి బయల్దేరాడు. రెండుగుఱ్ఱాలను తెప్పించి ఒకదానిపై తాను ఎక్కి ఇంకొకదానిపై భార్యను ఎక్కమని చెప్పాడు. వారు దారిలో వార్థక్యముచేత నడవలేక, ఎండబాధకు ఓర్వలేక, పరితపిస్తూ కాళ్ళు తడపడుతూ నడుస్తున్న తల్లిదండ్రులను చూచికూడా, లెక్కపెట్టకుండా గుఱ్ఱాలమీద స్వారీ చేస్తూ ముందుగా కాశీ క్షేత్రానికి సమీపానఉన్న కుక్కుటముని ఆశ్రమానికి చేరారు.

## కుక్కుటముని వృత్తాంతం

ఆకుక్కుటముని మహాత్యాన్ని వర్ణించటంఆదిశేషువుకుకూడా తరంకాదు. అతని తపోమహిమను ఎరుగనివారు లేరు. కుక్కుటముని తన తలిదండ్రులకు ప్రణామం చేసి వారికి సేవ చేసికొనుచున్నాడు. సకల దేవతలకంటె మాతాపితరులే ప్రత్యక్ష దైవములుగా భావించి వారి పాదాలు కడిగి వారి పాద తీర్థాన్ని రోజూ స్వీకరిస్తాడు.

ప్రజలు తమలో మునుగుటచే కలిగిన మహాపాతకాలను పోగొట్టుకోవటానికి గంగ,యమన.సరస్వతీ నదులు స్త్రీ రూపాలలో అర్థరాత్రి

సమయాన కుక్కుటముని ఆశ్రమానికి వచ్చి సేవ చేసుకొని వెళ్తూ ఉంటారు. కుక్కుటముని ఆశ్రమానికి ఎదురుగా ఉన్న ధర్మసత్రంలో బస చేసిన పుండరీకుడు భార్యాసమేతంగా వచ్చి కుక్కుటమునిని దర్శించి, "అయ్యా! మహిమాన్వితమైన కాశీక్షేత్రం ఇక్కడికి ఎంత దూరం?' అని అడిగాడు. దానికి ఆ యోగీశ్వరుడు," కాశీ ఎక్కడ ఉందో, ఎంత దూరంలో ఉందో నాకు తెలియదు'' అని చెప్పాడు. పుండరీకుడు, "ఇంత దగ్గర ఉన్న కాశీక్షేత్రం చూడని మీ జన్మ ఒక జన్మమేనా? చూస్తే పొట్టకూటికి యోగి వేషం వేసినట్టుగా ఉన్నావు.నీ వంటి నీచుడిని చూడలేదు'' అని హేళన చేసి తన విడిదకు చేరాడు.

ఆ రాత్రి గంగ, యమున, సరస్వతులు ముగ్గురూ మలిన రూపాలతో కుక్కుటముని ఆశ్రమంలోకి ప్రవేశించటం పుండరీకుడు చూసి వారిని పిశాచాలుగా భ్రమపడి భయకంపితుడైనాడు. వారు ఆశ్రమమంతా ఊడ్చి,నీళ్ళు చల్లి,ముగ్గులు పెట్టి తేజో రూపాలతో బయటికి రావటం చూశి, పుండరీకుడు వారితో," మీ మలినరూపాలు పోయి సుందరమైన రూపాలు మీకు ఎల్లా వచ్చాయి? అని అడిగాడు. గంగాదేవి వానిని చూసి," ఛీ పాపాత్ముడా! నీకు నా ముందు నుంచునే అర్హత లేదు. అవతలకు పోరా పాపాత్ముడా'' అంది. పుండరీకుడు గంగాదేవి పాదాలపైపడి ," తల్లీ ! నా పాపాలను నీవే పోగొట్టగల సమర్థురాలివి. నువ్వే నా పాపాలను పోగొట్టాలి'' అని వేడుకొన్నాడు. గంగాదేవి,"పాపాత్మా! మాతా పితృ ద్రోహి! నీవు ఈ జన్మలో చేసిన పాపాలకు లెక్కలేదు. కాని నీ పూర్వజన్మ సుకృతంచేత కుక్కుటముని ఆశ్రమంలోకి ప్రవేశించావు. వారి దర్శనం వల్లనే మమ్ము చూడగలిగావు. ఇక నువ్వు పాప రహితుడవు అగుగాక!'వ అని దీవించి , ఈమె యమునా దేవి, ఈమె సరస్వతీ దేవి, నేను గంగను. మేము నదులము. మా యందు స్నానం చేసిన వారి పాపాలు హరిస్తాయి. మాయందు మునిగినవారి పాపఫలంచేత మాకు మలినరూపాలు వస్తున్నాయి. మా మలినరూపాలను కుక్కుటముని కైంకర్యం చేత పరిహరించుకొని దివ్యరూపాలను పొందుతాము. ఇలా ప్రతిరోజూ మా పాపాలను పోగొట్టుకొనిపోతున్నాము.

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL